మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట వార్త

### జిల్లాలోని 508 గ్రామ పంచాయతీలు, 4508 వార్డులలో
## రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలి : జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధన మేరకు జిల్లాలోని 508 గ్రామ పంచాయతీలు, 4508 వార్డులలో రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియపై పంచాయతీ శాఖ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు జారీ చేసి మాట్లాడారు. గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కోసం 2011 సెన్సెస్, బీసీ రిజర్వేషన్ల కోసం ఎస్ఈఈఈపిసి 2024 ప్రకారం మొత్తం 50 శాతం మించకుండా ఆర్డీఓల నేతృత్వంలో ఆయా డివిజన్‌లలో రిజర్వేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. గ్రామ వార్డు సభ్యుల రిజర్వేషన్ ఎస్ఈఈఈపిసి ప్రకారం చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో రమేష్, డిపివో వినోద్‌కుమార్, ఆర్డీఓలు సదానందం, చంద్రకళ, డిఆర్‌డిఏ పిడి జయదేవ్‌ఆర్య, డివిజనల్ పంచాయతీ అధికారులు, ఎంపిడిఓలు,ఎంపిలు పాల్గొన్నాం

## కేజీబీవీని సందర్శించిన ట్రైనీ డిప్యూటీ కలెక్టర్

**న్యాల్‌కల్, నవంబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను శుక్రవారం ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రతిభశేఖర్ సందర్శించారు. పాఠశాల పరిసరాలను, వసతి గృహం లోని రికార్డులను, స్టోర్‌రూంలను పరిశీలించారు. క్రమశిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని ప్రతిభ శేఖర్ విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ ప్రతిభా శేఖర్


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## భూ ఆక్రమణలపై ఉక్కుపాదం : ఎమ్మెల్యే

**పట్టాన్‌చెరు, నవంబరు 21 ప్రభాతవార్త :** పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సీతారామపురం కాలనీలో భూఆక్రమణలపై సర్వే నిర్వహించి కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యా లయంలో జిహెచ్‌ఎంసి, రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు దశాబ్దాల క్రితం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీతారామపురం కాలనీలో కొన్ని సంవత్సరాలుగా అంతర్గత రహదా రులు, పార్కులు, ప్రార్థన స్థలాలు కబ్జాలకు గురవు తున్నాయని స్థానికులు ఫిర్యాదులు చేయడం జరిగిందని తెలిపారు. కాలనీని ఏర్పాటు చేసిన డెవలపర్లు ప్రభుత్వానికి రిజిస్టర్ చేయవలసిన రహదారులు, ప్రార్థన స్థలాలు, పార్కుల స్థలాలను బై నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. చివరకు కాలనీ సరిహద్దులలో గల చెరువులు, కాలువలను ఆక్రమించి ప్లాట్లు అభివృద్ధి చేస్తున్నారని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 1998వ సంవత్సరంలో మొదటి లే ఔట్‌తో ప్రారంభించి నేటి వరకు మూడు లేవుట్లుగా తయారు చేయడం జరిగిందని తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తి అవకాశాలు ఉన్నందున సర్వే నిర్వహించి ఆక్రమణలపై ఉక్కు పాదం మోపాలని అధికారులను ఆదేశించారు. కబ్జా లకు కారకులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని సూచించారు. ఈ సమా వేశంలో ఎమ్మార్వో రంగారావు, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, నీటి పారుదలశాఖ డీఈ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## సొసైటీ అభివృద్ధికి కృషి : యశ్వంత్‌రెడ్డి


యశ్వంత్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**టేక్మాల్, నవంబరు 21 ప్రభాతవార్త:** టేక్మాల్ ప్రాథమిక సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ యశ్వంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా యశ్వంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. టేక్మాల్ మండలంలో ప్రధాన రాజకీయ పార్టీలో నెలకొన్న అవిశ్వాసంతో మొదలైన వివాదం కారణంగా చైర్మన్ పదవి తమదంటే తమదంటూ అనుకొని రెండు వర్గాలు రెండు చైర్మన్‌లుగా ఎన్నుకున్నారు. తప్పుడు నివేదికలను సమర్పించి తమను దోషిగా పరిగణిస్తున్నారంటూ హైకోర్టులో యశ్వంత్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను స్వీకరించి చైర్మన్ యశ్వంత్‌రెడ్డే చైర్మన్‌గా కొనసాగుతారని తీర్పునిచ్చింది. ఈ మేరకు తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్లతో తన పదవిని దూరం చేయాలని చూశారన్నారు. సహకార సంఘ అభివృద్ధికి సమిష్టి కృషి అవసరమని ఆయన అన్నారు. రైతు సహకార సంఘాన్ని రాజకీయ రంగుతో ముక్కలు చేయకుండా అభివృద్ధిపథంలో తీసుకెళ్తామని అందుకు రైతులందరి సహకారం, కృషి అవసరమన్నారు. ఈ సందర్భంగా యశ్వంత్‌రెడ్డిని భారత రాష్ట్ర సమితి నాయకులు, రైతులు పూలమాలలు వేసి శాలువాలతో సన్మానించారు. ఇందులో మండల రైతులు, మండల పార్టీ అధ్యక్షుడు వీరప్ప, నాయకులు సిద్దయ్య, సలీం,భాస్కర్, ముక్తార్, గోవిందాచారి, బసంత్రావు, రవి, సాయిలు, బొట్ల సత్యం, మతిన్ , సాయిబాబా, ఈశ్వరప్ప, సలావుద్దీన్, బిఆర్‌ఎస్ కార్యకర్తలు తదితరులున్నారు.

## పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చేపట్టాలి
### అదనపు కలెక్టర్ చంద్రశేఖర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, నవంబరు 21, ప్రభాతవార్త :** పంచాయతీ ఎన్నికలకు అధికారులు సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్ నుండి జిల్లాలోని ఎంపీడీవోలు, ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. స్టేజ్ వన్, స్టేజ్ టు రిటర్నింగ్ అధికారుల నియామకం శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలు, తిరిగి ఎన్నికల నిర్వహణ తర్వాత ఎన్నికల సామాగ్రి స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారుల ఆదేశించారు. అలాగే బీసీ రిజర్వేషన్ విషయంలో బీసీ డెడికేషన్ కమిషన్ నివేదికను అనుసరించి చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలపై ఫిర్యాదులను స్వీకరించి, షెడ్యూల్‌ప్రకారం తుది జాబితా ప్రకటించాలని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ డిపిఓ సాయి బాబా, ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నేడు నర్సాపూర్‌కు మంత్రి వివేక్ వెంకట్ స్వామి రాక

**నర్సాపూర్, నవంబకు 21, ప్రభాతవార్త:** నేడు(శనివారం) నర్సాపూర్‌కు మంత్రి వివేక్ వెంకట్‌స్వామి రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్‌లోని సాయికృష్ణ గార్డెన్‌లో నిర్వహించనున్న కళ్యాణలక్ష్మి షాదీముబారక్ చెక్కులు, ఇందిరమ్మ చీరల పంపిణీ నిర్వహిస్తున్నారు. ఈకార్యక్రమానికి వివేక్ వెంకట్‌స్వామి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు ఆయన చెక్కులు, చీరలను పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గంలోకి బ్లాక్ కాంగ్రెస్ మండల కాంగ్రెస్ గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు మహిళా కాంగ్రెస్‌నాయకురాలు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్ యు ఐ నాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు ప్రజలు భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

### విధులు సక్రమంగా నిర్వహించని అధికారులకు
# జీతంలో కోత, కఠిన చర్యలు తప్పవు
### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త:**
అనుమతి లేనిదే సెలవు తీసుకుని ఇష్టానుసారంగా సమయ వేళలు పాటించకున్నా.. విధులు సక్రమంగా నిర్వహించని ప్రతి ఒక్క అధికారి జీతంలో కోత విధించడంతో పాటు కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. మండల పరిధిలోని చింతమడక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిద్దిపేట జిల్లా కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్, ఓపి రిజిస్టర్ పరిశీలించారు. ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధులకు హాజరుకాగా మెడికల్ ఆఫీసర్‌తో సహా మిగతా వారందరూ గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ కె.మంజుల సెలవులో ఉన్నట్లు సిబ్బంది తెలపగా డిఎం అండ్ హెచ్ఒకు ఫోన్ చేసి అనుమతి తీసుకున్నారా లేదా అని ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చేపేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు వైద్య సదుపాయాలు అందించడానికి పరికరాలు, స్టాఫ్‌ను అందజేస్తుందన్నారు.

**రైతులకు పేమెంట్‌లో జాప్యం చేయొద్దు...**
అనంతరం పుల్లూరు గ్రామంలోని ఐకెపి వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రోజు వారీగా లోడ్ కాగానే ట్రక్‌షిట్ జనరేట్ చేయాలని రైతులకు పేమెంట్‌లో జాప్యం లేకుండా చూసుకోవాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు. సెంటర్‌లో అన్ని సౌకర్యాలు ఉండాలని తేమశాతం రాగానే గన్నిలలో నింపి వెంటనే లోడ్ చేయాలని ఆదేశించారు.

**ఈవిఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్**
జిల్లా కలెక్టరేట్ సమీపంలోగల ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నెలవారీ పరిశీలనలో భాగంగా గోదాం చుట్టూ వీక్షించి రక్షణ చర్యలను పరిశీలించారు. లాగ్ బుక్ చేసి విజటర్స్ రిజిస్టర్‌లో సంతకంచేశారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల ప్రకారం చుట్టు సిసి కెమెరాల పనితీరు పోలీసు అధికారులు 24 గంటలు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు తరుచు గోదాం పరిసర ప్రాంతాన్ని పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులు ఉన్నారు.


ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి



మాట్లాడుతున్న రాజయ్య

## శంభునికుంటను కబ్జాదారుల నుండి కాపాడాలి
### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాజయ్య

**పటాన్‌చెరు, నవంబరు 21, ప్రభాతవార్త :** అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడలో ఉన్న శంభునికుంటను కబ్జాదారుల నుండి కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ రాజయ్య అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల విలువచేసే ప్రభుత్వ భూములను, చెరువులు, కుంటలను కబ్జాలు చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గత ప్రభుత్వ విధానాలనే ఈ ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. ప్రభుత్వ భూములు,చెరువులు, కుంటల పరిరక్షణకు అమీన్‌పూర్‌లో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన, పోరాటాలు చేస్తున్నామని తెలిపారు. శంభునికుంట విషయంలో హైడ్రా అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు, స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని చెప్పారు. 1500 మంది ప్రజల సంతకాలను సేకరించి కలెక్టర్‌కు అందించడం జరిగిందన్నారు. అయినా స్పందించడం లేదన్నారు. అందుకోసమే ఈరోజు పార్టీ ఆధ్వర్యంలో నిహారదీక్ష చేస్తున్నామని ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నర్సింహారెడ్డి, నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, లలిత,శ్రీనివాస్ రెడ్డి,జార్జ్, సునీత, పద్మావతి, మల్లేశ్వరి, లావణ్య, వీరస్వామి, మణిరాజు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## అన్యాక్రాంతమవుతున్న భూములపై విచారణ జరిపించాలి

**పటాన్‌చెరు, నవంబరు 21, ప్రభాతవార్త:** పెద్దకంజర్ల గ్రామంలో అన్యాక్రాంతవుతున్న భూములపై సమగ్ర విచారణ జరిపించడంతోపాటు ప్రభుత్వం స్వాధీనం చేసుకుని గ్రామస్తులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం పార్టీ పటాన్ చెరు ఏరియా కమిటీ కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల సాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంద్రేశం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పెద్ద కంజర్ల గ్రామంలో 120,121,125 సర్వే నెంబర్లలో 2022లో రాష్ట్ర ప్రభుత్వం 240 ఎకరాల భూములను పరిశ్రమల ఏర్పాటు ట్రక్ టెర్మినల్స్ పేరుతో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం భూములను సేకరించిందన్నారు. కానీ జిల్లా అధికార యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టినప్పుడు గ్రామస్తులకు ఇండ్ల స్థలాలు ఇస్తామని హామీనిచ్చారని, ఆ హామీని ప్రస్తుతం జిల్లా అధికారులు తుంగలో తొక్కారని ఆరోపించారు. పెద్ద కంజర్ల గ్రామంలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్న జిల్లా రెవెన్యూ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నదని వాపోయారు. పెద్ద కంజర్ల గ్రామ భూభాగోతం పై సమగ్రమైన విచారణ జరిపించి, భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని జిల్లా అధికార యంత్రంగానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జంగయ్య, ముత్యాలు, నాగభూషణం, గ్రామ మహిళలు ధర్నాలో పాల్గొన్నారు.



ధర్నా నిర్వహించి సిపిఎం నాయకులు


అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

## తెల్లాపూర్ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాల కూల్చివేత
### -నిరసన వ్యక్తం చేసిన బాధితులు.. నచ్చచెప్పిన పోలీసులు

**రామచంద్రాపురం, నవంబరు 21, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మించుకున్న 9నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్మాణాలు చేసుకుంటే కూల్చివేయడంతో పాటు చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. క్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న తరుణంలో భాధితులు ఘటన స్థలానికి చేరుకుని నిరసన వ్యక్తం చేయడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. పంచాలు తీసుకుంటూ బిల్డర్‌లకు సహకరిస్తూ పేదవారి ఇండ్ల నిర్మాణాలను అన్యాయంగా కూల్చి వేస్తున్నారని బాధితులు మున్సిపల్ కమిషనర్‌పై ఆందోళనకు దిగారు. కూల్చివేతలు కోర్టు స్టే ఆర్డర్‌ను ఉలంఘించి నిర్మించారని బాధితులు ఆరోపించారు. కమీషనర్‌కు వ్యతిరేకంగా బాధితులు పెద్దఎత్తున నినాదాలు చేస్తుండటంతో విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని నిరసన కారులకు నచ్చచెప్పారు.

## ఆర్ఐని నిర్బంధించిన శివంపేట గ్రామస్థులు
### -నచ్చచెప్పి విడిపించిన సిఐ అనిల్‌కుమార్

**చౌటకూరు, నవంబరు 21, ప్రభాతవార్త:** రెవిన్యూ అధికారులకు ఆర్ఆర్ఆర్ రైతుల నిరసనసెగ తగిలింది. ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి సంబంధించి నష్టపరిహారం నోటీసులు అందచేసేందుకు వచ్చిన ఆర్ఐని శివంపేట పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి నిరసన వ్యక్తం చేశారు. భూమి భూమి లేదా ఒక ఎకరానికి కోటి రూపాయల పరిహారం చెల్లిస్తే కాని తమ భూములు ఇచ్చేది లేదని బాధిత రైతులు పేర్కొన్నారు. రెవిన్యూ అధికారులను నిర్బందించినట్లు తెలుసుకున్న సిఐ అనిల్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చచెప్పి అధికారులకు నిర్బందం నుంచి విముక్తి కల్పించారు. ఎకరానికి 16 లక్షల ఇస్తే సరిపోదని, కోటి రూపాయలు పరిహారంగా చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. ఎకరానికి 75లక్షల చెల్లిస్తామని ఆందోలు ఆర్‌డిఓ పాండు అప్పట్లో హామి చేయడంతోనే సర్వే పనులకు సహకరించామని, అప్పుడు 75 లక్షలు అని చెప్పి ఇప్పుడు 16 లక్షల అంటే ఎలా అని ప్రశ్నించారు. ఆర్‌డిఓ పాండు గ్రామానికి రావాలని రైతులు డిమాండ్ చేయగా విషయాన్ని ఫోన్ ద్వార ఆర్‌డిఓకు సమాచారం అందించగా నష్టపరిహారం రెట్టింపు చేయాలంటూ ఈపాటికే ప్రభుత్వానికి, ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ప్రతిపాదనలు పంపామని ఆర్‌డిఓ పాండు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. రైతుల డిమాండ్‌లను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామఎని ఆర్‌డిఓ హామి చేసినట్లు తెలుస్తోంది.


గ్రామస్తులకు నచ్చచెబుతున్న సిఐ అనిల్‌కుమార్


ప్రభుత్వ ఆసుపత్రిలో హల్‌చేస్తున్న యువకుడు

## ప్రభుత్వ ఆసుపత్రిలో యువకుడి హల్‌చల్
### తండ్రి చనిపోయిన కోపంలో ఆసుపత్రి ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త :** హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రిలో గురువారం అర్ధరాత్రి ఒక యువకుడు హల్‌చల్ చేశాడు. కోహెడ మండలం సిసిపల్లెకు చెందిన దొంతరబోయిన విజయ్ (45)కు అర్ధరాత్రి గుండెపోటు రాగా బంధువులు హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తీసుకురాగానే విజయ్‌ని పరీక్షించిన వైద్యసిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆస్పత్రి సిబ్బంది సమయానికి ఆక్సిజన్ పెట్టకపోవడంతోనే తండ్రి మృతి చెందాడంటూ ఆగ్రహించిన కుమారుడు కోపంతో ఆస్పత్రి ఫర్నిచర్, అద్దాలు ధ్వంసం చేశాడు. ఆసుపత్రి సిబ్బంది ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి వివరించారు.

## దాడి కేసులో నిందితుల అరెస్ట్

**కొండపాక, నవంబర్ 21, ప్రభాతవార్త :** కుట్రపూరితంగా దాడిచేసిన నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై మల్లేశం శుక్రవారం తెలిపారు. దుద్దెడ గ్రామానికి చెందిన దోమల ఐలయ్యను కుల సంఘం అధ్యక్షుడిగా తొలగించడానికి అన్‌లైన్ సర్వీస్‌సెంటర్ నడుపుతున్న జక్కుల రాజు కారణమని, డబ్బులు సంపాదిస్తు గ్రామంలో, కులంలో మంచి పేరు రావడన్ని జీర్ణించుకోలేక, ఎలాగైనా అతనికి చెడ్డపేరు తేవాలని మనసులో కక్ష పెంచుకున్న ఐలయ్య రాజుపై కుట్రపన్ని, సిద్దిపేటకు చెందిన దూరు నాగమణిని రాజుకు చెడ్డ పేరు తేవడనికి స్నేహితుల ద్వారా రూ.10 వేలకు ఒప్పందం కుదుర్చుకొని పథకం ప్రకారం ఈ నెల 8న దూరు నాగమణితోపాటు మరో ఐదుగురు మహిళలు దుద్దెడలోని రాజు షాపులోకి వెళ్లారు. అధార్ కార్డుపై డబ్బులు ఇవ్వాలని అతనితో రెచ్చగొట్టే విధంగా మాట్లాడి అసభ్యంగా మాట్లాడుతూ, దాడి చేస్తూ షాపునుండి బయటకు లాక్కొచ్చారని తెలిపారు. ఈ విషయమై అదే రోజు రాజు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ జరిపిన పోలీసులకు ఇది కుట్రతో జరిగిన దాడిగా తేలడంతో నాగమణిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు.

## మద్యానికి వచ్చి చోరీకి పాల్పడిన దుండగులు

**చేర్యాల (మద్దూరు), నవంబర్ 21, ప్రభాతవార్త :** మద్యానికి వచ్చిన దుండగులు బంగారాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో గ్రామంలో జరిగింది. మద్దూరు పోలీసుల కథనం ప్రకారం... నర్సాయపల్లి గ్రామానికి చెందిన యెల్ల కవిత భర్త వెంకటేశ్ ఇంట్లో ఉండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు మద్యానికి వచ్చి ఇంటి ముందు కూర్చుని తాగిన అనంతరం తలుపు తీయండి అంటూ బలవంతంగా ఇంట్లోకి చొరబడి దంపతులను బెదిరించి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెలతాడు, 2 తులాల నల్లపూసల దండ, రూ. 53 వేల నగదును ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితులు ఇద్దరు అరవడంతో అక్కడి నుండి దుండగులు పారిపోయారని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**విచారణ పేరుతో యువకులను వేధించిన పోలీసులు...**
చేర్యాల పట్టణంలో ఒక పాల దుకాణంలో పనిచేస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అసభ్యంగా మాట్లాడుతూ, దొంగతనం పేరుతో వేధించారని యువకులు ఆరోపించారు. నర్సాయపల్లిలో గురువారం రాత్రి మద్యం కోసం వచ్చి దొంగతనానికి పాల్పడ్డారనే ఆరోపణలతో తమను రాత్రి 10.30 గంటలకు చేర్యాల అంగడిబజార్ నుండి నర్సాయపల్లికి తీసుకెళ్లి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని 3 గంటలపాటు వేధించిన అనంతరం తాము కాదని సారీ చెప్పి వదిలేశారని తెలిపారు. ఈ విషయంపై చేర్యాల సిఐ శ్రీనును వివరణ కోరగా అనుమానంగా ఉన్న మరికొందరితో పాటు వీరిని అదుపులోకి తీసుకుని విచారణలో భాగంగానే తీసుకెళ్లామే తప్పా ఎలాంటి వేధింపులకు గురి చేయలేదన్నారు. అయితే అమాయకులైన ప్రజలనే పోలీసులు టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష.. 16 మందికి జరిమానా

**గజ్వేల్ టౌన్, నవంబరు 21 (ప్రభాతవార్త):** మద్యం తాగి వాహనాలు నడిపిన ఒకరికి రెండు రోజుల జైలుశిక్ష విధించగా 16 మందికి రూ.లక్షా 60వేల జరిమానా విధించడం జరిగిందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్‌లోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజులు క్రితం వాహనాల తనిఖీలో పట్టుబడిన 17 మందిని శుక్రవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరుపరచగా విచారణ జరిపి గజ్వేల పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన గుడూరి కనకయ్యకు రెండు రోజుల జైలుశిక్ష విధించగా మరో 16 మందికి రూ.లక్ష 60వేల జరిమానా విధించడం జరిగిందని తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో పత్తి దగ్ధం


కాలిపోయిన పత్తి

**సంగారెడ్డి, నవంబరు 21, ప్రభాతవార్త:** షార్ట్‌సర్క్యూట్‌తో రేకుల షెడ్‌లో ఉన్న పత్తి పంట దగ్ధమైన సంఘటన సిర్గాపూర్ మండలం అంతర్గాం తండా పరిధిలోని పత్యానాయక్ తండాలో గురువారం రాత్రి జరిగింది. పత్యానాయక్ తండాకు చెందిన మారునిబాయి పొలంలో పండించిన 10 క్వింటాళ్ల పత్తి పంటను రేకులషెడ్‌లో ఉంచింది. రాత్రి విద్యుత్ షార్క్‌సర్క్యూట్‌తో రేకుల షెడ్‌లో నిల్వ ఉంచి పత్తి పంటతో పాటు ఇతరసరుకులు దగ్ధమయ్యాయని బాధితురాలు కన్నీరు పెట్టుకుంది. ప్రభుత్వం మారునిబాయిని ఆదుకోవాలని తండావాసులు వినతి చేశారు.

## వృద్ధుడి అదృశ్యం

**న్యాల్‌కల్, నవంబరు 21, ప్రభాతవార్త:** మండలపరిధిలోని హుమ్నాపూర్ గ్రామానికి చెందిన కాలువపల్లి నర్సింలు (75) ఈ నెల 20న కుమారుడితో కలిసి గ్రామశివారులోని హజరత్ సయ్యద్‌షా మహ్మద్ పీర్ చిస్తీ దర్గా వద్దకు చేరుకున్నారు. దర్గా నుంచి బహిర్భుకి వెళ్తానని చెప్పి వెళ్లిన నర్సింలు తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో రామ్‌నాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. గత మూడు మాసాలుగా నర్సింలు మానసిక పరిస్థితి బాగలేదని, నర్సింలు బాత్‌రూంకు వెళ్లిన సమయంలో తెలుపు రంగు షర్ట్, పంచ కట్టుకుని ఉన్నాడని ఎస్ఐ వివరించారు. తప్పిపోయిన నర్సింలును గుర్తిస్తే పోలీసు ఠాణాకు సమాచారం అందించాలని ఎస్ఐ దోమ సుజిత్ సూచించారు.

# పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిది
### తెలంగాణ అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డాక్టర్ సి.సువర్ణ



జ్యోతి ప్రజ్వలన చేసి జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

**ములుగు, నవంబరు 21 (ప్రభాతవార్త):**
మానవ మనుగడకు పర్యావరణం ఎంతో ముఖ్యమని, పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉండాలని తెలంగాణ అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డాక్టర్ సి.సువర్ణ పేర్కొన్నారు. శుక్రవారం ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్, తెలంగాణ ఉన్నత విద్యామండలి, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సౌజన్యంతో పర్యావరణం, వ్యర్థాల నిర్వహణ, సమస్యలు, ప్రభావాలు, సవాళ్లు, అవకాశాలు అనే అంశంపై రెండు రోజులు జరగబోయే జాతీయ సదస్సు కళాశాల డీన్ వి.కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధకులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యావరణ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా తెలంగాణ అటవీ శాఖ ప్రధాన సంరక్షణ అధికారి డాక్టర్ సి.సువర్ణ, ఆచార్య కొండ లక్ష్మణ్‌బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ డి.రాజిరెడ్డి, తెలంగాణ అటవీ సంరక్షణ అధికారి డాక్టర్ ప్రియాంకవర్గీస్ హాజరై మాట్లాడారు. పట్టణీకరణ, నగరీకరణ వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతుందని, వ్యర్థాలు పేరకుపోతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ, భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్-2047 సిద్ధం చేస్తున్న తరుణంలో ఇలాంటి సదస్సు నిర్వహించడం పర్యావరణానికి గొప్ప మేలు చేస్తుందని తెలిపారు. వ్యర్థాల నుండి సంపదను సృష్టించే పద్ధతులు కనిపెట్టి, కొత్త తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత యువత, పరిశోధకులు, విద్యార్థులు తీసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రతి ఒక్కరూ రెడ్యూస్-రీయూజ్-రీసైకిల్ అనే నినాదాన్ని పాటిస్తూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిజ్ఞ తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్, సదస్సు కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్.శ్రీనిధి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సమస్యలపై నవీన్‌యాదవ్‌కు సిపిఎం వినతిపత్రం



నవీన్‌యాదవ్‌తో సిపిఎం పార్టీ నాయకులు.

**జూబ్లీహిల్స్, నవంబరు 21, ప్రభాతవార్త:** సీపీఎం పార్టీ జూబ్లీహిల్స్ జోన్ నాయకులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్‌యాదవ్‌ను శుక్రవారం యూసుఫ్‌గూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ నాయకులు సాయిశేషగిరిరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఉన్న సమస్యలపై వినతిపత్రం అందించారు. ఆయా సమస్యలను పరిష్కరించాలని కోరారు. బోరబండ, మధురానగర్‌లో ఆంగ్ల మాధ్యమ పాఠశాలలను ఎత్తివేశారని, బోరబండ బస్టాప్‌లో ప్రాథమిక పాఠశాలను స్వరాజ్‌నగర్‌కు మార్చాలని, బోరబండలోని సామాజిక భవనంలో కొంత భాగంలో తాత్కాలికంగా పాఠశాలను ఏర్పాటుచేయాలని కోరారు. అలాగే శిశువిహార్‌లోని ఆయాలకు సంబంధించి దాదాపు అయిదు నెలలుగా జీతాలు రావడం లేదని, వారికి జీతాలు వచ్చేలా అధికారులతో మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ జోన్ కన్వీనర్ రాపర్తి అశోక్, జాకటి స్వామి, జెవివి లక్ష్మణ్, రవీందర్, బిక్షపతి, బాలయ్య, దేవదాస్, భాగ్యరాజ్, లాలూయాదవ్, ఆసిఫ్, పటేల్, సికిందర్ తదితరులు పాల్గొన్నారు

### గ్యార్మీ పండుగ వేడుకల్లో పాల్గొన్న నవీన్‌యాదవ్

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీకృష్ణనగర్‌లోని మజీద్-ఏ-జహూర్-ఏ-కరీమీ మజీద్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గ్యార్మీ వేడుకల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్‌యాదవ్ పాల్గొన్నారు. సూఫీ ఆధ్మాతమ్మిక గురువు అయిన హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీ జ్ఞాపకార్థంగా జరుపుకొనే ఈ పండుగ ముఖ్య ఉద్దేశం పాపప్రక్షాళణ అన్నారు. ఆధ్యాత్మిక చింతనను ప్రోత్సహించడం, ఐకమత్యానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మజీద్ కమిటీ సభ్యులు ఫారిద్, హుస్మాన్, ఫైజ్, షానవాజ్ తదితరుల పాల్గొన్నారు.

## కాలనీ పార్కు త్వరలో అత్యుత్తమ పార్కుగా మారబోతున్నది



పార్కులో అధికారులలో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

**హైదరాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త:** అంబర్‌పేట నియోజకవర్గం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని వైభవనగర్‌కాలనీ పార్కును శుక్రవారం సందర్శించారు. కొంత సేపు ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు మాట్లాడుతూ సుమారు 70 లక్షల రూపాయల వ్యయంతో పార్కులో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పార్కు త్వరలో డివిజన్‌లో అత్యుత్తమ పార్కుగా మారబోతున్నదన్నారు. పార్కును కాలనీ ప్రజలకు అనుగుణంగా రూపకల్పన చేయాలని, పిల్లలకు ఆట స్థలం, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు ప్రుద్వీ, రవి, మజీద్, చంద్రశేఖర్, శ్రీధర్, డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు

## యువకళాకారులే భారతీయ సాంస్కృతిక రాయబారులు

**-రాష్ట్ర ఖజానా-లెక్కల శాఖ ఉపసంచాలకురాలు వసుంధర**



సంగీత గురువులను సత్కరించిన వసుంధర, శ్రీదేవి, రాధాకుమారి, విజయకుమార్, సుధారాణి తదితర సంస్థ సభ్యులు

**రవీంద్రభారతి, నవంబరు 21 ప్రభాతవార్త :** యువకళాకారులే భారతీయ సాంస్కృతిక రాయబారులని, దేశ సంస్కృతి, సంప్రదాయాలు, కళలను పరిరక్షించవలసిన బాధ్యత వారిపైనే ఉందని తెలంగాణ రాష్ట్ర ఖజానా మరియు లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి.వసుంధర అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, సంగీత నాటక అకాడమీల సౌజన్యంతో నవ్యనాటకసమితి ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో 8రోజులపాటు నిర్వహిస్తున్న 50వ అఖిల భారత సంగీత నృత్య పోటీల 6వరోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న జి.వసుంధర విశిష్ట అతిథులు ఎ.శ్రీదేవి, రాధాకుమారి, లక్ష్మీప్రసన్న, సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సి.లక్ష్మి, నాట్యగురువులు ఇందిరాహేమ, మధుమతి కులకర్ణి తదితరులతో కలిసి ప్రముఖ సంగీత గురువులు కౌశిక్ కళ్యాణ్, అచ్యుతకుమారి, నారాయణ, బాలాజీలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేసి వారి కళాసేవను కొనియాడారు. ఈనాటి సంగీత నృత్య పోటీల్లో కర్ణాటక సంగీతం జూనియర్ విభాగంలో వీణ, వయోలిన్ పోటీలు ఆసక్తికరంగా జరిగి ఆహుతులను తన్మయుల్ని జేశాయి.

## మణిదీప్‌ను ఆదర్శంగా తీసుకుని యువత సేవ చేయాలి



మణిదీప్‌ను ఆశీర్వదిస్తున్న స్వామిజీ, ఇతర పురోహితులు

**హైదరాబాద్,నవంబర్ 21,ప్రభాతవార్త:** యువతరం అనేక సమస్యలతో పోరాడుతున్న నేటి భారతావనిలో ఒక దృఢ సంకల్పం యువత మార్పు కోసం సమాజ సేవలు భాగస్వాములు కావాలని దేవాంత రామానుజియర్ స్వామి అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ కత్రియాలో సామాజిక వేత్త మణిదీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రసంగించారు. మణిదీప్ అతిపిన్న వయసులోనే ట్రస్టును ఏర్పాటు చేసి సామాజిక సేవకు పూనుకుకోవడం హర్షణీయమన్నారు. కరోనా మహమ్మారి సమయంలో బయటికి రావడానికి భయపడ్డా ప్రజానీకానికి నేనున్నానంటూ, అండగా నిలబడి చలిలో పడుకునే యాచకులకు దుప్పట్లు పంపిణీ చేశారని అటువంటి వ్యక్తిత్వం ఉన్న మనిషి మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆకాంక్షించారు. అలాగే యువత చెడు మార్గాన్ని వదిలి మణిదీప్ లాంటి యువ సామాజికవేత్తను స్ఫూర్తిగా తీసుకొని విద్యా ఉద్యోగంలో రాణించడంతోపాటు సమాజ సేవలో కూడా వారి వంతు పాత్ర పోషించేలా ప్రతి యువకుడు యువతీ కృషి చేయాలని ఈ సందేశం ప్రతి కుటుంబం అందిపుచ్చుకోవాలని సేవా మార్గంతో కలిగే సంతృప్తి సంపాదనలో ఉండదనే విషయాన్ని గుర్తిరగాలని సందేశాన్ని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, రెడ్ క్రాస్ సొసైటీ భీమిరెడ్డి, నగరంలోని వివిధ స్వచ్ఛంద సేవకులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాల కొండ 'మణికొండ'

**- అందిన కాడికి దండుకుంటున్న అధికారగణం**
**- అడ్డగోలుగా వెలుస్తున్న అనుమతులు లేని నిర్మాణాలు**
**- ఉన్నతాధికారులు దృష్టి సారించాలంటున్న స్థానికులు**



మణికొండలోని వెంకటేశ్వర కాలనీలో అనుమతులు ఉల్లంఘించి నిర్మిస్తున్న జి+6 అపార్టుమెంటు దృశ్యం



మణికొండ మున్సిపాలిటీలో అనుమతులకు విరుద్ధంగా జి+5 నిర్మిస్తున్న దృశ్యం.

**నార్సింగి, నవంబర్ 21 ప్రభాతవార్త :** మున్సిపాలిటీ అధికారుల అండతో అక్రమ నిర్మాణాల కొండగా "మణికొండ" మారిపోయింది. ఏ కాలనీ చూసినా జి+2, జి+4 అనుమతులు పొంది ఏకంగా జి+5,6,7 అంతస్థులు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మణికొండలో 30.వరకు సెట్ బ్యాక్స్ లేకుండా, సెల్లార్లు తీసిన అనుమతులు ఉల్లంఘించి భారీ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. యధేచ్ఛగా ఈ అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా అడ్డుకోవాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చూసీ, చూడనట్లు వ్యవహరించడం వెనుకాల ఆంతర్యం ఏమిటో గమనార్హం. వేంకటేశ్వర కాలనీ, పంచవటి కాలనీ, అల్కాపూర్ టౌన్‌షిప్, జనప్రియ కాలనీ, నెక్‌నాంపూర్, పుప్పాలగూడ, మణికొండ ప్రాంతాలలో జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. నిత్యం ఈ ప్రాంతాలలో టౌన్‌ప్లానింగ్ జవాన్లు, మున్సిపల్ బిల్ కలెక్టర్లు తిరుగుతున్నా ఎవరి కంటా ఈ అక్రమ నిర్మాణాలు పడకపోవడం శోచనీయం.

**అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తున్న అధికారగణం**

మణికొండ మున్సిపాలిటీలో జోరుగా అక్రమ నిర్మాణాలు కొనసాగడానికి మున్సిపల్ అధికారగణమే కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏ భవనానికి ఎంత అనుమతులు ఇచ్చారో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు స్పష్టంగా తెలిసినా అదనపు అంతస్థులు నిర్మిస్తున్న వారిని ఎందుకు అడ్డుకోవడం లేదని పలువురు వయోజనులు ప్రశ్నిస్తున్నారు. అప్పుడప్పుడు పత్రికల్లో అక్రమ నిర్మాణాలపై వార్తలు వస్తే అధికారులు స్పందించి, సదరు అక్రమ నిర్మాణదారులను మున్సిపల్ కార్యాలయంకు పిలిపించుకొని నోటీసులు ఇవ్వడం, అక్కడక్కడ శ్లాబులకు బొక్కలు పెట్టి, అదనంగా డబ్బులు దండుకోవడం జరుగుతుంది. అధికారులు అక్రమ నిర్మాణమని కూల్చి వేసిన భవనాల వద్ద మళ్లీ నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు అడ్డుకోవడం లేదంటే ఆమ్యామ్యాలు దండుకోవడం వల్లనే అని అర్థం అవుతుంది. భవన నిర్మాణ అనుమతులకు ఓ రేటు, అదనంగా వేసుకునే అక్రమ నిర్మాణాలకు మరో రేటు, ఓసీలకు ఇంకో రేటు అంటూ ఒక్కో అక్రమానికి ఒక్కో రేటును ఫిక్స్ చేసి మరీ వసూళ్లు చేస్తున్నారు మణికొండ మున్సిపల్ అధికారులు. ఇది తప్పని నిరూపించాలంటే మున్సిపల్ అధికారులు ప్రస్తుతం కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకొని చూపాలని విద్యావంతులు సవాల్ చేస్తున్నారు. అధికారుల అక్రమ సంపాదన నాడీని పట్టుకున్న కొంతమంది బిల్డర్లు అధికారులకు ఆమ్యామ్యాలు ఇస్తూ యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాల గురించి ఇంచార్జి టిపిఎస్ మనోహర్‌ను వివరణ అడిగితే నాకు నాలుగు మున్సిపాలిటీలు బాధ్యతలు ఇచ్చారని, ఎక్కడా న్యాయం చేయలేకపోతున్నానని తెలిపారు. మున్సిపాలిటీలో టిపిఎస్ అందుబాటులో ఉండడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

**కమిషనర్ వివరణ :**

మణికొండ మున్సిపాలిటీలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల విషయంపై ప్రభాతవార్త కమీషనర్ ప్రదీప్ కుమార్‌ను వివరణ అడిగితే పొంతనలేని సమాధానాలు చెప్పారు. ఇంతపెద్ద మణికొండ మున్సిపాలిటీకి పూర్తి స్థాయి టిపిఓను ప్రభుత్వం ఇవ్వడం లేదని, దాని వల్లనే మేము అక్రమ నిర్మాణాలపై సరైన చర్యలు తీసుకోలేకపోతున్నామన్నారు. ఉన్న సిబ్బందితో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవచ్చు కదా? అంటే మాపై సవాలక్ష ఒత్తిడులున్నాయని తెలిపారు. కమీషనర్ అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకుంటామనకుండా, తప్పించుకునే సమాధానాలు చెప్పారు.

## ఛలో హైదరాబాద్ జయప్రదం చేయాలి : ఎఐటియూసి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

**నిజాంపేట్, నవంబర్ 21, ప్రభాతవార్త** మున్సిపల్ రంగంలో పని చేసే ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేత్తనం రూ.26000 చేయాలనీ, అలాగే కార్మికుల సమస్యలపై నవంబర్ 26వ తేదీన ఛలో హైదరాబాద్ జయప్రదం చేయాలనీ ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసు రత్నం కోరారు. శుక్రవారం సి.డి.ఎం.ఎ ఆఫీసు ముందు ధర్నాకు సంబంధంచిన వినతిపత్రని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేబ్బీర్ అలీకి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులుయ్ కోలన్ గోపాల్ రెడ్డి, ఏఐటీయూసీ మున్సిపల్ స్టాఫ్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఏసు రత్నం, ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాలభిందెల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 26వ తేదీన ఛలో హైదరాబాద్ లో భాగంగా సి.డి.ఎం.ఎ ఆఫీసు ముందు ధర్నా కార్యక్రమం ఉందని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపల్ లో పని చేసే కార్మికులు వారి సమస్యలు పరిస్కారం కోసం పెద్ద ఎత్తున్న తరలి వస్తున్నారని అన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ లేని వారికీ కల్పించాలన్నారు. గత ఎన్నికల సందర్భంగా కెసిఆర్ మున్సిపల్ కార్మికులు దేవుళ్ల అని, కచ్చితంగా మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తానని చెప్పి చేయలేదన్నారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు మరచ్చిపోయారని, కార్మికుల వేతనాలు పెంచక సుమారుగా 6సంవత్సరాలు అయిందని అన్నారు. నవంబర్ 26వ తేదీన జరగబోయే ఛలో హైదరాబాద్ కార్యక్రమనికి పెద్ద ఎత్తున కార్మికులు తరలి రావాలని వారు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఆశి. యాదయ్య, పొన్నికంటి దస్తగిరి పాల్గొన్నారు.

## నిత్య అభివృద్ధి, ప్రజా సంక్షేమం అభివృద్ధికి తారకమంత్రం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**జగద్గిరిగుట్ట, నవంబర్ 21, ప్రభాతవార్త** నిత్య అభివృద్ధి, ప్రజా సంక్షేమం ఇవే అభివృద్ధికి తారక మంత్రం అని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. శుక్రవారం 126 జగద్గిరిగుట్ట డివిజన్ షిర్డీ హిల్స్ కాలనీలో సుమారు రూ. 42 లక్షలతో నూతనంగా చేపట్టనున్న ఎనిమిది సీసీ రోడ్డు పనులకు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని అన్నీ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, శ్రీ సాయి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ షిర్డీ హిల్స్ అధ్యక్షులు బండ మహేందర్, జనరల్ సెక్రటరీ దినేష్, కోశాధికారి కె.వినోద్ యాదవ్, శోభా నాయక్, శైలజ, సురేందర్ రావు, నగేష్, మేకల రమేష్, రవి, అనిల్, రాజు, ప్రభాకర్, విష్ణు, సీనియర్ నాయకులు బాబు గౌడ్, పాపులు గౌడ్, శశిధర్ ముదిరాజ్, బ్రహ్మానంద చారి, పాపిరెడ్డి, ఆజం, బ్రహ్మనంద చారి, బీఎస్ఆర్ నాని, మెట్ల శ్రీను, విఠల్, నాగరాజు, ముంతాజ్, గిరి, మనోజ్, కొండయ్య సాగర్, రామకృష్ణ సాగర్, హనుమంతు, సాయిలు యాదవ్, బీరప్ప యాదవ్, పండరి, సంతోష్ యాదవ్, బీరప్ప యాదవ్, పండరి యాదవ్, హనుమంత్ యాదవ్, క్రిష్ణ, శ్రవణ్, నాగేందర్ యాదవ్, మహిళా నాయకురాలు త్రివేణి పాల్గొన్నారు.

## పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్‌కు సిఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వానం



సిఎంకు ఆహ్వానపత్రి అందిస్తున్న ఉదయ్‌సింగ్ బయాస్, శ్రీకాంత్, చక్రధర్‌రావు తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 21,ప్రభాతవార్త:** దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్‌ను నవంబర్ 25 నుంచి మూడు రోజులపాటు హైటెక్స్ లో నిర్వహి స్తున్నట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఎగ్జిబిషన్ కు రావాలని ఆహ్వానించినట్లు తెలిపింది. ఈ సందర్భంగా పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ.. వికసిత్ భారత్ దిశగా, స్థిరమైన పౌల్ట్రీ భవిష్యత్తుకు దారితీస్తూ 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను వన్ నేషన్ వన్ ఎక్స్‌పో" అనే దూరదృష్టి ఉన్న థీమ్ కింద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 25న నోవోటెల్‌లో నాలెడ్జ్ డేతో ఈఈవెంట్ ప్రారంభమవుతుందని అన్నారు. ఇందులో 1,500కి పైగా ప్రతినిధులు, 7కు పైగా అంతర్జాతీయ నిపుణులు పాల్గొంటారన్నారు. సస్టైనబుల్ ఫీడ్ సొల్యూషన్స్, ఆటోమేషన్, పౌల్ట్రీ వ్యాధులు, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాలు వంటి ముఖ్యమైన అంశాలపై చర్చిస్తారని తెలిపారు. ప్రస్తుతం భారతదేశం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానం బ్రాయిలర్ మాంస ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉంది అని అన్నారు. మాంసం ఉత్పత్తిలో ప్రతి సంవత్సరం 8 నుంచి 10శాతం వృద్ధి చెందుతుందని తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.1.35 లక్షల కోట్లకు పైగా తోడ్పడుతూ, పోషకాహారం, గ్రామీణాభివృద్ధి, ఉద్యోగావకాశాల పెరుగుదలకు కీలకంగా ఉందని అన్నారు. వికసిత్ భారత్ దిశగా, భారత పౌల్ట్రీ రంగం గొప్పతనాన్ని ప్రపంచానికి ప్రదర్శించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈఎగ్జిబిషన్‌కు 50 దేశాల నుంచి 500కిపైగా ఎగ్జిబిటర్స్, 40,000కుపైగా సందర్శకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, పౌల్ట్రీ ఇండియా ట్రెజరర్ శ్రీకాంత్, చక్రధర్ రావు, కె. జి. ఆనంద్, తెలంగాణ పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు కె. మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వి. నరసింహారెడ్డి, జీ కే మురళి పాల్గొన్నారు.

## రోడ్డు పనులు వేగవంతం చేస్తాం : కార్పొరేటర్



పనులను పర్యవేక్షిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్

**చిక్కడపల్లి నవంబర్ 21 (ప్రభాతవార్త ) :** గాంధీనగర్ డివిజన్ పరిధిలోని ఎస్బి హెచ్ కాలనీ లో రూ.22 లక్షలతో ప్రారంభించిన నూతన రోడ్డు నిర్మాణం పనులను శుక్రవారం జి హెచ్ ఎం సి ఇంజనీరింగ్ అధికారులు,కాలనీ వాసులను బిజెపి నాయకులతో కలిసి స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ పర్యవేక్షించారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి కాలనీ వాసులకు, ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గీత, అసిస్టెంట్ ఇంజనీర్ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ వికాస్ పథకానికి వెంటనే నిధులు విడుదల చేయాలి



ప్రసంగిస్తున్న తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ

**చిక్కడపల్లి నవంబర్ 21 ( ప్రభాతవార్త ) :** రాజీవ్ వికాస్ పథకానికి వెంటనే నిధులు విడుదల చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజీవ్ వికాస్ పకథం పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దళితులకు అనేక హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటి వరకు అమలు చేయాలేదని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం దళిత వ్యతిరేకంగా వ్యవహారిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బంధు సొసైటీ అధ్యక్షుడు పల్లె వీరస్వామి, లాయర్ మల్లన్న, కల్లెపల్లి లక్ష్మీనారాయణ, పురుషోత్తం, బి.ఎన్. రాంచందర్, కల్యాణి, కల్ప, విజయలక్ష్మి, ప్రకాష్ పాల్గొన్నారు.

## సొంతూరకని వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**నార్సింగి, నవంబర్ 21 ప్రభాతవార్త :** సొంతూరికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... జార్ఖండ్ రాష్ట్రం ధర్మబంధ్ ధన్బాద్ ప్రాంతానికి చెందిన సంతోష్ మహతో(32), శంకర్ మహతో ఇటీవల హైదరాబాద్‌కు వచ్చి గండిపేట మండలంలోని కోకాపేటలోని బిఎస్ఆర్ లేబర్ కాలనీలో నివసిస్తూ కూలీ పని చేస్తు జీవిస్తున్నారు. 11.సెప్టెంబర్ 2025న సంతోష్ మహతోకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. 23.వ,తేదీన సొంతూరుకు వెళ్తున్నట్లు శంకర్ మహతోకు చెప్పి వెళ్లాడు. 29.వ,తేదీన కుటుంబ సభ్యులను సంప్రదించినా సంతోష్ ఊరికి రాలేదని తెలిసింది. దీంతో శంకర్ మహతో స్నేహితులు, పరిసర ప్రాంతాలలో ఎంత వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో శంకర్ మహతో నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అదృశ్యమైన సంతోష్ హిందీ మాత్రమే మాట్లాడుతాడని, 5.6ఫీట్ల ఎత్తు ఉంటాడని, ముదురు వర్ణంలో ఉంటాడని, ఆచూకి తెలిసిన వారు నార్సింగి పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

## ఆరోగ్య సమస్యలతో మహిళ ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, నవంబర్ 21, ప్రభాతవార్త** ఆరోగ్య సమస్యలతో మనస్థాపం చెందిన ఓ మహిళ ఆత్మహత్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పేట్ బషీరాబాద్ సి.ఐ. విజయవర్ధన్ తెలిపిన వివరాల మేరకు సికింద్రాబాద్‌లోని హెడ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్న కుంటి నిరోష (32) ఆమె అన్నయ్య నరేష్‌తో పాటు కలిసి పద్మ నగర్ ఫేజ్2లో అద్దెకు ఉంటున్నారు. ఆమెకు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉండడం వల్ల పెళ్లి కాలేదన్నా మనస్తాపం చెంది జీవితంపై విరక్తితో గురువారం సాయంత్రం 06:30 గంటలకు ఇంటిలోనే ఫ్యాన్‌కు తన చున్నీతో అన్న ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. నిరోష తండ్రి అందె వెంకటయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుచున్నట్లు పేట్ బషీరాబాద్ సి.ఐ. విజయవర్ధన్ తెలిపారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

**అత్తాపూర్ నవంబరు 21, ప్రభాతవార్త :** మైలార్ దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిపై ఆకస్మిక దాడి చేసి ఆరుగురు పేకాట రాయుళ్లను ఎస్వోటీ పోలీసులు అరెస్టు చేసి మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. పేకాట రాయుళ్లు హరీష్ గౌడ్ ,వెంకటరెడ్డి ,ఎన్ను శ్రీనివాస్ రెడ్డి , వెంకట్ రెడ్డి,జగదీశ్వర్ , జగన్మోహన్ రెడ్డిల వద్ద 28000 నగదు,ఆర్ సెల్ ఫోన్లు ప్లేయింగ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఐజెయు కోశాధికారిగా ఆస్కాని

**నిజాంపేట్, నవంబర్ 21, ప్రభాతవార్త** ఐజెయు వర్కింగ్ కమిటీ అధ్యక్షులుగా గీతార్థ్ పాఠక్, ప్రధాన కార్యదర్శిగా వినోద్ కుమార్ కోహ్లీ, కోశాధికారిగా తెలంగాణ ప్రాంతానికి చెందిన టియుడబ్ల్యూజె ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ ఎన్నికయ్యారు. సభ్యులుగా జమ్మూ కాశ్మీర్ నుండి ఇంతియాజ్ అహ్మద్ బజాజ్, అస్సాం నుండి సుమన్ సుల్తానా అహ్మద్, ఛత్తీస్గఢ్ నుండి నిజామ్, త్రిపుర నుండి సంతోష్ గోపి, మహారాష్ట్ర నుండి హేమంత్ ఎస్ సామంత్, అస్సాం నుండీ జీతూ కళాతాలు ఎన్నికయ్యారు.

**జాతీయ స్థాయిలో ఐక్య కార్యాచరణ**

ఐజెయు జాతీయ స్థాయిలో జర్నలిస్టుల సమస్యలపై ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు అభిప్రాయపడ్డారు. చండీఘర్ కేంద్రంగా జరిగిన సమావేశంలో ఇప్పటి వరకు రెండు గ్రూపులుగా ఉన్న ఐజెయూ నాయకులు ఒక్కటై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. దేశంలో ఇంకో ఐజేయు గ్రూప్ కూడా ఉందని వారు కూడా కలిసి వస్తే సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణను వెల్లడిస్తామని తెలిపారు. ఇప్పటివరకు ఒక గ్రూప్‌కు అధ్యక్షులుగా కొనసాగుతూ వస్తున్న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తాజా మాజీ సభ్యులు, చండీఘర్ రాష్ట్రానికి చెందిన వినోద్ కుమార్ కోహ్లీతో పాటు అస్సాంకు చెందిన మరో గ్రూప్ అధ్యక్షులు గీతార్థ్ పాఠక్‌లు ఇకపై ఒకే వేదికగా పనిచేస్తామని ప్రకటించారు. మాజీ ఐజెయు అధ్యక్షులు సురేష్ అకౌరి, డిల్లీకి చెందిన ఐఎఫ్‌జె నాయకురాలు సబీన ఇంద్రజిత్, ఐజెయు ప్రధాన కార్యదర్శిగా పని చేసిన సబా. నాయకన్‌ల సలహాలు తీసుకొని ముందుకు సాగుతామని ప్రకటించారు. ఆరు మాసాల్లో ప్లీనరీ నిర్వహించి ఎన్నికలు జరుపుకోవడానికి గాను ఒక అడహక్ కమిటీని వేస్తున్నట్లు తెలిపారు. చీఫ్ రిటర్నింగ్ ఆఫీసర్‌గా గుజరాత్‌కు చెందిన ప్రజాపతిని నియమించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వారితో అడహక్ వర్కింగ్ కమిటీని ప్రకటించారు.

## లైబ్రేరియన్లకు ప్రమోషన్లు కల్పించేందుకు సిఎం చొరవ చూపాలి





ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బాలునాయక్, శివకుమార్ తదితరులు

**హైదరాబాద్,నవంబర్ 21,ప్రభాతవార్త:** సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేద, మధ్య తరగతి,ఉన్నత వర్గాలకు సమానమైన నాణ్యమైన విద్యా అవకాశాలను కల్పించడానికి కృషి చేస్తుందని తెలంగాణ గవర్నమెంట్ జూనియర్ కాలేజీ లైబ్రరీయన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. బాలు నాయక్, ప్రధాన కార్యదర్శి ఓ. శివ కుమార్ లు అన్నారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యా శాఖ నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేస్తుందన్నారు. ఐతే ప్రమోషన్ లేని ఏకైక శాఖ లైబ్రరీ శాఖ మాత్రమే అని, లైబ్రరీయన్లకు ప్రమోషన్ ఛానల్ ను ఏర్పాటు చెయ్యాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు. యుడిఐఎస్ ఇ, శాశ్వత విద్యా సంఖ్య ని తప్పనిసరి చెయ్యడం ఆధునీకరణ వైపు ఒక కీలక అడుగుగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా విద్యా శాఖ ను పర్యవేక్షిస్తూ ప్రతీ పాత జిల్లాకు ఒక ప్రత్యేక అధికారిని నియమించారన్నారు. కళాశాల ప్రవేశాలను పెంచడం, అవగాహన కార్యక్రమాలను, సౌకర్యాల మెరుగుదల వంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈకార్యక్రమాలను విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలిపారు.డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు పది కోట్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ ప్రతీ కాలేజీకి పదివేల నుండి ఇరవై వేల వరకు మెయింటైనెన్స్ కొరకు ఇవ్వడం హర్షణీయమన్నారు.ఈ కార్యక్రమంలో సందీప్, మహేందర్, కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## సురారం పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



**జీడిమెట్ల, నవంబర్ 21, ప్రభాతవార్త** సురారం పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ డీసీపీ ఎన్.కోటిరెడ్డి ఐపిఎస్ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేసి పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డ్స్‌ను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసుల గురించి సి.ఐ ను అడిగి తెలుసుకుని వాటిని త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బంది పని తీరుని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కృషి కాలనీలో 20 సీసీటీవి కెమెరాలను ప్రారంభించారు.

## అడిక్‌మెట్ డివిజన్ సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తా

**..ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్**



అచ్యుత రెడ్డి మార్గ్ ప్రాంతంలో డ్రైనేజీ పైప్ లైన్ పనుల్లను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ , చిత్రంలో బిఆర్ఎస్ నేత సురేందర్, అనురాధ తదితరులున్నారు.

**చిక్కడపల్లి నవంబర్ 21 ప్రభాతవార్త :** అడిక్ మెట్ డివిజన్ సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని అచ్యుత రెడ్డి మార్గ్ ప్రాంతంలో విద్యానగర్ డ్రైనేజ్ పైపులైన్ల పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ సీనియర్ నేతలు కే.సురేందర్, కె.అనురాధ, ప్రేమలత, శైలజ, కవిత, ప్రియాంక, ముచకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న బి.వెంకటస్వామి గౌడ్ తదితరులు

**చిక్కడపల్లి నవంబర్ 21 (ప్రభాతవార్త :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లబిస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, తెల్ల ఉప్పలం దేవాలయం అధ్యక్షుడు వెంకట కృష్ణ (బబ్లూ) అన్నారు. బాగ్లింగంపల్లి సుందరయ్య పార్కులోని తెల్ల ఉప్పలమ్మ దేవాలయంలో శుక్రవారం సీనియర్ వాకర్ బి. వెంకట్ స్వామి గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న వెంకట కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంచుకోవాలని సూచించారు. మనుషులకు నడక మంచి నడవాడికి ప్రధానం అన్నారు. ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.


గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

## ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరికలు...

**కొమురవెల్లి, నవంబరు 21, ప్రభాతవార్త :** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవారం మండలంలోని ఆయా గ్రామల్లో విస్తృతంగా పర్యటించి పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలతోపాటు మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ శ్రేణుల సమావేశాల్లో సమస్యలు, అభివృద్ధిపై చర్చించారు. కొమురవెల్లిలో బిజెపి, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఆయా పార్టీలకు రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో చేరారు. దీంతో పార్టీలో చేరినవారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీని మరింత పటిష్టం చేయడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆయా సమావేశాలలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం


ముదిరాజ్ జెండాను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**నంగునూర్, నవంబరు 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని పాలమాకులలో శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం తెలంగాణ ముదిరాజుల సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నాయకులు రాజు, కనుకరాజు, లక్ష్మణ్, రాజయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ముదిరాజ్‌లకు చేపపిల్లలను సకాలంలో అందించాలన్నారు. నాణ్యమైన చేప పిల్లలను అందించి ముదిరాజ్ ఆర్థికాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సాయిలు, చంద్రయ్య, సత్తయ్య, వెంకటేష్, సంపత్, గ్రామస్తులు వేణుచక్రవర్తి, ఐలయ్య, దుంపల శ్రీనివాస్, వెల్పుల ఐలయ్య, కొమురయ్య, గంగుల రవి, పంగ రవి పాల్గొన్నారు.

## స్వచ్ఛత, ఆరోగ్యంపై ప్రజలు దృష్టి పెట్టాలి

### ఎన్ఎస్ఎస్ చైర్మన్ గంగాధర్


మానవహారం నిర్వహిస్తున్న వాలంటీర్ల దృశ్యం

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 21, ప్రభాతవార్త :** ప్రజలు స్వచ్ఛతతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని ఎన్ఎస్ఎస్ చైర్మెన్ గంగాధర్ అన్నారు. శుక్రవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో నిర్వహిస్తున్న శీతాకాల ప్రత్యేక కార్యక్రమంలో ఓటు హక్కు ప్రాముఖ్యత, మానవ నైపుణ్యాల వినియోగం, సామాజిక బాధ్యత, స్వచ్ఛత, ఆరోగ్య సదుపాయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ఇంటింటికి తిరిగి వారు చేస్తున్న సామాజిక కార్యక్రమాల గురించి సర్వే నిర్వహించి ప్రజలను చైతన్యం పరచారు. సామాజిక బాద్యతలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఒక విశాలమైన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ఎన్ఎస్ఎస్ చైర్మన్, హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్ ప్రారంభించారు. ర్యాలీలో విద్యార్థులు, వలంటీర్లు ప్లకార్డులు, డప్పుసప్పులు, నినాదాలు ప్రజల్లో చైతన్యం నింపాయి. గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు బీసీ కాలనీలలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రణదీర్ కుమార్, ప్రధానోపాధ్యాయులు అరుణాదేవి, అధ్యాపకులు సిహెచ్ రాజిరెడ్డి, ఎమ్ వెంకటేష్, ఉపాధ్యాయ బృందంతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## భయం లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలి

### జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి అధికారి రవిందర్‌రెడ్డి


మాట్లాడుతున్న రవిందర్‌రెడ్డి

**హుస్నాబాద్ టౌన్, నవంబరు 21, ప్రభాతవార్త :** ఇంటర్ విద్యార్థులు రాబోయే పరీక్షలకు భయం లేకుండా సిద్ధం కావాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలతో పాటు గురుకుల బాలికల కళాశాల, అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లతో పాటు కళాశాల అనుమతి, అనుభవంత ధృవపత్రాలు, ఉపాధ్యాయుల రిజిస్టర్‌ను పరిశీలించారు. తరగతుల నిర్వహణ గురించి నేరుగా విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అపోలో ఒకేషనల్ కళాశాల విద్యార్థుల అనుమతి, విద్యుత్ సబ్‌స్టేషన్, వ్యవసాయ, పశువైద్య శిక్షణపై ( ఆన్ జాబ్ ట్రేనింగ్)కు సంబందించిన వివరాలను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు అయిన సిలబస్ గురించి, అంథులోని కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు తెలుసుకున్నారు. మనిషి జీవితంలో విద్యార్థి దశ కీలకం అని ఈ వయస్సులో చేడు అలవాట్లకు లోనవకుండా భవిష్యత్తు గురించి ఆలోచించి ఎలాంటి భయం లేకుండా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

## విద్యార్థులు దురలవాట్లకు బానిస కావద్దు : ట్రాఫిక్ ఎసిపి

**ములుగు, నవంబరు 21 (ప్రభాతవార్త):** విద్యార్థులు దురలవాట్లకు బానిస కావద్దని మేడ్చల్ ట్రాఫిక్ ఏసిపి కె.వెంకట్‌రెడ్డి అన్నారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్‌విఎం మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలు, యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసిపి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు, ఆరోగ్య సమస్యల గురించి వివరించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపరంగా ఎలాంటి శిక్షలు ఉంటాయో తెలిపారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయరాదని, డ్రైవింగ్ చేసేటప్పుడు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ ట్రాఫిక్ సిఐ శంకర్, ములుగు ఎస్ఐ రఘుపతి, మెడికల్ కళాశాల డీన్ శ్రావణ్‌కుమార్, డైరెక్టర్ గోపికృష్ణ, సీఈవో దేవరకొండ శ్రీనివాస్‌రావు, విజిలెన్స్ ఆఫీసర్ కె.రవికుమార్, సీఎస్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లోని ఆలోచనలకు ఒక రూపమే సైన్స్‌ఫెయిర్

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యార్థులలో ఉన్న ఆలోచనలకు ఒక రూపం కల్పించేది సైన్స్ ఫెయిర్ అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల(డాక్టర్ అబ్దుల్ కలాం) ప్రాంగణంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్, 53వ రాష్ట్రీయ బాలల వైజ్ఞానికి ప్రదర్శన 2025 ముగింపు సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలలో ప్రదర్శించిన ప్రదర్శనలు, ఉపయోగాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సైంటిస్ట్, ఇంజనీర్ ఉంటారని పేర్కొన్నారు. సైన్స్ ఫెయిర్ విద్యార్థులో ప్రోత్సాహన్ని అందిస్తుందన్నారు. సైన్స్ అనేది మన జీవితాన్ని మార్చేస్తుందాన్నరు. వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులో మంచి ఉత్సాహం నింపాలన్నారు. విద్యార్థుల ఆలోచనలకు ప్రతిరూపం ఇన్నోవేషన్ అన్నారు. కరెంటు, టెలిఫోన్‌లాంటివి అన్ని ఇన్నోవేషన్ నుంచి వచ్చినవేనని తెలిపారు. ఇన్నోవేషన్‌కు ఆకాశమే హద్దు అని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. రాష్ట్రంలో అత్యుత్తమ సైన్స్ ఫెయిర్ సిద్దిపేటకు వచ్చిందన్నారు. వచ్చే ఏడు టెన్త్ ఫలితాల్లో మొదటి స్థానంలో ఉండాలని అన్నారు. అత్యధిక మార్కులు సాధించే విద్యార్థులు ఐ ప్యాడ్‌లు అందిస్తానని తెలిపారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు చాలా సమస్యలు ఉన్నాయని వచ్చే అసెంబ్లీలో సమావేశాలల్లో చర్చిస్తానని తెలిపారు. డిఈవో శ్రీనివాస్‌రెడ్డి, సైన్స్ అధికారి కళ్లెపల్లి శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో వివిధ ఉపాధ్యాయసంఘాల నాయకులు శశిధర్‌శర్మ, ఆస లక్ష్మణ్, కౌన్సిలర్ మల్లికార్జున్, నాయకులు రాజనర్సు, కొండం సంపత్ రెడ్డి, పూజల చిన్నా, వజీర్, మోయిజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను అకట్టుకున్నాయి.


విద్యార్థుల ప్రదర్శనలు తిలకించి వివరాలను అడిగి తెలుసుకుంటున్న హరీష్‌రావు

**సైన్స్‌ఫెయిర్‌ను తిలకించిన ఎంపి, ఎమ్మెల్సీ**

మెదక్ ఎంపి రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి సైన్స్ ఫెయిర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను తిలకించారు. వారివెంట బిజెపి నాయకులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## గంగపుత్రుల అస్తిత్వాన్ని, కులవృత్తిని కాపాడాలి

**చిన్నకోడూరు, నవంబరు 21, ప్రభాతవార్త :** సంప్రదాయ మత్స్యకారులైన బెస్తగూండ్ల గంగపుత్రుల అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని, కుల వృత్తిని కాపాడుతూ ప్రత్యేక రక్షణ చట్టం చేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ హైమావతికి, ఫిషరీష్ డిపార్టుమెంటకు చిన్నకోడూరు గంగపుత్రుల సంఘం అధ్యక్షులు లక్మణ్ ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. చేప విత్తన కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి సంప్రదాయ మత్స్యకారులకు ప్రత్యేక రుణ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తి జరుగుతున్న చేపల వ్యాపార రంగంలోకి ఎగుమతులు, దిగుములు చేసుకోవడానికి అనుగుణంగా ప్రత్యేక రుణాలు ఇవ్వడం ద్వారా శీతల గిడ్డంగులు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించాలన్నారు. జిల్లా చైర్మన్‌లో 70 శాతం చైర్మన్‌లను మత్స్యకారులైన గంగపుత్రలకే ఇవ్వాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉన్న మాదిరిగా మత్స్యకారులకు రక్షణ చట్టం చేయాలన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి సరైన న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంగపుత్రుల సంఘం ప్రతినిధులు గుడిసె ప్రభు, పల్లె నరసింహులు, సిద్దిపేట, చిన్నకోడూరు, నారాయణరావుపేట గంగపుపత్ర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీకి సింధూజ ఎంపిక

**మర్కుక్, నవంబరు 21 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని బి.సంధూజ ఇన్స్పైర్-2024-25 జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ పోటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో వెంకటరాములు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తమ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య మార్గదర్శకత్వంలో విద్యార్థిని సింధూజ రూపొందించిన ఫర్టిలైజర్ డిస్పెన్సర్ విత్ మల్టీప్లే టాస్క్స్ ప్రాజెక్ట్ జిల్లా స్థాయిలో ప్రశంసలు అందుకొని రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఇదిలావుండగా జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థి సింధూజకు మెదక్ ఎంపి మాధవనేని రఘునందన్‌రావు, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డిల చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెమొంటోలను అందజేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని సింధూజను పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ అభినందించారు. రాష్ట్ర స్థాయిలో కూడా అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

**అహ్మదీపూర్ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి భానుప్రసాద్...**

**గజ్వేల్, నవంబరు 21 (ప్రభాతవార్త):** సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన విద్య వైజ్ఞానిక ప్రదర్శనలో గజ్వేల్ మండలం అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎం.భానుప్రసాద్ ప్రదర్శించిన ఆటోమెటిక్ వాల్ క్వింబర్ అండ్ పెయింటింగ్ డివైస్ ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్‌కు ఎంపికైంది. ఈ సందర్భంగా విద్యార్థి భానుప్రసాద్‌ను, గైడ్ టీచర్ హఫీజ్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సుగుణాకర్, ఉపాధ్యాయులు అభినందించారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్ పత్రాలను విడుదల చేసిన మండల విద్యాధికారి

**చిన్నకోడూరు, నవంబరు 21, ప్రభాతవార్త :** మండల స్థాయి చెకుముఖి టాలెంట్ టెస్ట్ పత్రాలను శుక్రవారం రోజున మండల విద్యాధికారి తిరుపతి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ అభివృద్ధి కోసం మనమందరం కూడా కృషి చేయాల్సిన అవసరం ఉందని అదేవిధంగా మూఢనమ్మకాలను నమ్మకూడదని వివరించారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్ముగల్ల కనకరాజు, పాఠశాల ఇంఛార్జి వేంకటేశం, కృష్ణమూర్తి, రవీందర్ రెడ్డి, రంజిత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వికసిత్ భారత నిర్మాణంలో యువతది కీలకపాత్ర : ఎంపి రఘునందన్‌రావు

**దుబ్బాక, నవంబరు 21, ప్రభాతవార్త :** 2047 నాటికి వికసిత భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం దుబ్బాక పట్టణంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఎక్తార్యాలీని ఎంపీ రఘునందన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్, జమ్ము-కాశ్మీర్ వంటి కొన్ని రాజ్యాలు స్వతంత్ర దేశాల్లా నిలవాలని ప్రయత్నించినా, భారత దేశానికి స్వాతంత్రం వచ్చిన 13 నెలల తర్వాత, 1948 సెప్టెంబర్ 15న హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన చారిత్రక ఘటనను గుర్తుచేశారు. 736 జిల్లాల్లోకి ఏక్తా ర్యాలీ భారత ప్రభుత్వం మహీ భారత్ పేరిట నిర్వహిస్తుండటం సర్దార్ పటేల్ సంకల్పానికి నిదర్శనమని చెప్పారు. నవంబర్ 7తో వందేమాతరం గీతం రచనకు 150 ఏళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. 565 సంస్థానాలను ఏకం చేసి అఖండ భారత్ నిర్మాణం సర్దార్ పటేల దూరదృష్టికి నిదర్శనమని కొనియాడారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చేందుకు కృషి జరుగుతోందని, విశ్వగురువు భారత్ లక్ష్యం సాధనలో ప్రజలందరూ సంఘటితంగా ముందుకు సాగాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునకు అనుగుణంగా అందరూ కృషి చేయాలని సూచించారు.

## కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన హరీష్‌రావు

**సిద్దిపేట రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ఇందిరా నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అంతకుముందు క్యాంపు కార్యాలయంలో తడకపల్లి బీసీ హాస్టల్ విద్యార్థులకు రూ.6 లక్షల విలువగల కార్పోరేట్‌స్థాయి బెడ్స్‌ను హరీష్‌రావు అందించారు. బీసీ హాస్టల్ విద్యార్థులకు బెడ్స్‌న్ అందించి మరో సారి ఔదార్యాన్ని మానవత్వాన్ని చాటుకున్నారు. అలాగే క్యాంపు కార్యాలయంలో 311 మందికి సిఎం సహాయ నిధి నుంచి రూ.71 లక్షల 50 వేల చెక్కులను లబ్దిదారులకు హరీష్‌రావు అందించారు. ప్రశాంత్‌నగర్ స్మశానవాటికలో విద్యుత్ దీపాలను ప్రారంభించారు. పట్టణ మున్సిపాల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో కౌన్సిలర్, పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, రాజనర్సు, వరాల సురేష్, తల్లురి శ్రీనివాస్, పాల్గొన్నారు.

## మండల స్థాయి చెకుముకి పోటీల నిర్వహణ

**కొండపాక, నవంబరు 21, ప్రభాతవార్త :** మండల స్థాయి చెకుముకీ సైన్స్ పోటీలను మండల కేంద్రంలోని కొండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక అధ్వర్యంలో 8,9,10 తరగతుల విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చెక్‌ముకీ టాలెంట్ టెస్ట్ పోటీల్లో మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా, మోడల్ స్కూల్ తోపాటు ప్రైవేట్ పాఠశాలల నుండి 33 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సిర్సనగండ్ల ఉన్నత సాఠశాల విద్యార్థులు సుహాన, హారిక, పరమేష్ ప్రథమ స్థానంలో నిలించారు, కొండపాక బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు హర్షవర్దన్, సాయి కిరణ్, రిత్విక్‌లు ద్వితీయ స్థానంలో నిలించారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు నవంబర్ 27న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెకుముకి మండల కన్వీనర్ బాలకిషన్ తెలిపారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం శ్రీలత, హారతి, గజిటెడ్ హెచ్ఎం ప్రబాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, రాంచంద్రం, రాములు, అకోక్, స్వప్న, బాగ్యలక్ష్మి, శోభరాణి, కనకయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## చెకుముకి పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబర్ 21, ప్రభాతవార్త:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ మండల్ లెవెల్ పరీక్షలు శుక్రవారం సంగారెడ్డి లోని సెయింట్ ఆంటోనీ స్కూల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సెయింట్ ఆంటోనీ స్కూల్ డైరెక్టర్ విజయ జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బాలయ్య ప్రధాన కార్యదర్శి సాయి తేజ కోశాధికారి ప్రశాంత్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ జగన్ మోహన్, చెకుముకి కన్వీనర్ శశిధర్ సైన్స్ అండ్ టెక్నాలజీ చైర్మన్ వరప్రసాద్ లు పాల్గొన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ లో సెయింట్ ఆంటోనీ హై స్కూల్ శాంతినగర్ విద్యార్థులు టౌన్ మండల ఫస్ట్, సంగారెడ్డి అర్బన్ నుండి సెయింట్ ఆంటోని హై స్కూల్ విద్యానగర్ మొదటి స్థానం సాధించారాని నిర్వహకులు తెలిపారు.

గవర్నమెంట్ తెలుగు మీడియం స్కూల్ న్యూ గవర్నమెంట్ హై స్కూల్ ఫస్ట్ రాగా, గవర్నమెంట్ ఇంగ్లీష్ మీడియం తరఫున గర్ల్స్ హై స్కూల్ విద్యార్థులు ఫస్ట్ రావడం జరిగింది మండల్ లో ఫస్ట్ వచ్చిన విద్యార్థులకు ఈనెల 28వ తేదీ శుక్రవారం నాడు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష నిర్వహించబడుతుందని నిర్వాహకులు తెలిపారు.

# మాలల బహిరంగ సభను విజయవంతం చేయాలి

### మాల మహానాడు జిల్లా ఇన్‌చార్జీ రవీందర్

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో ఈనెల 23 ఆదివారం నిర్వహించే బహిరంగ సభకు హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి మాలలు, మాల అనుబంధ సంఘాల నాయకులు, ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఇన్‌చార్జీ బోజు రవీందర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఇందుకు సంబందించిన వాల్‌పోస్టర్‌ను సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు సూచనలకు విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించిన తీరును తప్పుపట్టారు. 2011 జనాభా లెక్కలతో సరైన ఎంపరికల్ డేటా లేకుండా కులాల వారీగా చేసిన ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును మరోసారి సమీక్షించి జీవో 99ను సవరించి మాలలతో పాటు గ్రూప్ 3 లోఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలని, చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుత జనాభా కనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని వెంటనే పెంచాలన్నారు. పెండింగ్‌లోఉన్న ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని, రాష్ట్రంలో మాల కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి 1000 కోట్ల నిధులను కేటాయించాలని, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులపై శ్వేత విడుదల చేసి, నిధులను ఖర్చు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాస శ్రీనివాస్, హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు నోముల బాలయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ లీగల్ సెల్ అడ్వైజర్ చావుల రాజమౌళి, సావుల శ్రీనివాస్, మీడియాసెల్ ఇంచార్జీ బోడుమల్ల సంపత్, బత్తుల రాజయ్య, వెన్న రాజయ్య, మాశం కొమురయ్య, గిరిమల్ల ప్రసాద్‌తో పాటు తదితరులు ఉన్నారు.


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

## విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన

**జగదేవ్‌పూర్, నవంబరు 21 (ప్రభాతవార్త):** మండల కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులకు డిసిసిబి మేనేజర్ నాగభూషణం ఆధ్వర్యంలో శుక్రవారం భారతీయ బ్యాంకింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భారతీయ బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన కలిగివుండాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు సైబర్ మోసాల బారినపడకుండా అవగాహన కల్పించాలన్నారు. డిసిసిబి బ్యాంకులో స్వర్ణనిధి డిపాజిట్ పథకం ద్వారా ఎక్కువ వడ్డీ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## మాల జయభేరిని జయప్రదం చేయండి


సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ నవంబరు 21, ప్రభాతవార్త:** ఈ నెల 23న హైదరాబాదులోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే "మాలల రణభేరి" మహాసభను జయప్రదం చేయాలి మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బి.జనార్దన్ కోరారు. సంగారెడ్డిలో శుక్రవారం దీనికి సంబంధించి గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు విజయరావ్ అధ్యక్షుడు బక్కన్న నాగయ్య ప్రధాన కార్యదర్శి బి మల్లేశం నర్సింలు బీ మురళి మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**



మాట్లాడుతున్న శ్రీనాథ్, రామచంద్రయ్య

విధి నిర్వహణలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ జిల్లా ఇన్‌చార్జీ శ్రీనాథ్, డివిజన్ ఇంజనీర్ రామచంద్రయ్య అన్నారు. శుక్రవారం సిద్దిపేట డివిజన్‌లో విద్యుత్‌లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు ఇంజనీర్‌లకు జిల్లా కేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వారు మాట్లాడుతూ విద్యుత్ సిబ్బంది అందరూ క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా పని చేయాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ప్రతీ విద్యుత్ అధికారి కూడా ప్రజలకు అందుబాటులో ఉండి ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ సదస్సులో ఎస్ఏవోలు, ఏడిఈలు, ఏఈలతో పాటు సిబ్బంది ఉన్నారు.

## రెగ్యులర్ కార్యదర్శిని నియమించండి

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త :** విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న డిప్యూటేషన్‌పై వచ్చిన కార్యదర్శిని తొలగించి గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని కోరుతూ మండలంలోని పందిల్ల గ్రామానికి చెందిన ప్రజలు, యువకులు శుక్రవారం మండల ప్రజా పరిషత్ అధికారికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పందిల్ల గ్రామ కార్యదర్శిగా గతంలో పని చేసిన శ్రీనివాస్ ఇక్కడి నుండి బదిలీ కావడంతో సతీష్ అనే కార్యదర్శికి పోస్టింగ్ ఇచ్చారని అయితే ఆయన డిప్యూటేషన్‌పై గాంధీనగర్‌కు వెల్లాడని ఆయన స్థానంలో ముత్తన్నపేట గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్న రాజేందర్ డిప్యూటేషన్‌పై వచ్చారని, వచ్చిన ఆయన గ్రామ ప్రజలకు కనీసం అందుబాటులో ఉండడం లేదని, గ్రామంలోని సమస్యలను గురించి వివరిస్తే పట్టించుకోకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న ఆయనను గ్రామం నుండి తొలగించి తమ గ్రామానికి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలని విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గ్రామానికి చెందిన దాదాపు ముప్పై మంది యువకులు ఉన్నారు.

## అగ్ని వీరులుగా సింగూరు గురుకులం విద్యార్థులు

**పుల్‌కల్, నవంబరు 21, ప్రభాతవార్త:** 69వెస్జీఎఫ్ 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్ ఓవరాల్ ఛాంపియన్ షిప్ మండల పరిధిలోని సింగూరు సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు అగ్ని వీర్‌కు ఎంపికయ్యారు. గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో విద్యను అందుకుంటున్న మునిపల్లి మండలం మున్సానిపల్లి గ్రామానికి చెందిన బోయిని శివకుమార్, మనూర్ మండలం బోరంచ గ్రామానికి చెందిన ఇటర్మీడియట్ పూర్వ విద్యార్థి బేగరి అరుణ్‌కుమార్‌లు ఈ నెల 10, 11వ తేదీలలో హనుమకొండలో జరిగిన ఆర్మీ ర్యాలీలో పాల్గొని అగ్నివీర్‌కు ఎంపికయ్యారు.

## ఆర్టీసి సిబ్బందికి ప్రగతి చక్ర ఆవార్డులు

**జహీరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్టీసి డిపోలో శుక్రవారం ప్రగత చక్ర అవార్డులను డిఎస్‌పి సైదా నాయక్ అందచేశారు. ఆయా విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్లకు, మెకానిక్‌లకు, ఇతర సిబ్బందికి అవార్డులు(ప్రశంస పత్రాలు), నగదు బహుమతులు అందచేసి అభినందించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి సైదానాయక్ మాట్లాడుతూ ఉత్తమసేవలు అందిస్తున్నవారికి అవార్డులు అందచేయడం ఆనందంగా ఉందన్నారు. డిపో మేనేజర్ స్వామి మాట్లాడుతూ అవార్డులు ఉద్యోగుల ప్రతిభను వెలికితీయడమే కాకుండా ఉత్సాహం పెరిగేలా చేస్తుందన్నారు.

**శబరిమల బస్సు చార్జీల కరపత్రం ఆవిష్కరణ...**

అయ్యప్పా స్వామి మాలధారులు, భక్తులు శబరిమలకు వెళ్లేందుకు ఆర్టీసి బస్సు చార్జీల కరపత్రంను డిఎస్‌పి సైదా నాయక్ డిపో మేనేజర్, డిపోఅధికారులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజ్ సూపర్‌వైజర్ బంగి నాయక్, డిపో సూపర్‌వైజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాల సిఐ శీనుపై చర్యలు తీసుకోవాలి : మల్లారెడ్డి

**చేర్యాల, నవంబర్ 21, ప్రభాతవార్త :** చేర్యాల సిఐ శ్రీనుపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కమీషనర్‌తో పాటు హుస్నాబాద్ ఏసిపిలకు ఫిర్యాదు చేసినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో కుమ్ముక్కై రియల్ ఎస్టేట్ వ్యాపారులతో భూ సెటిల్మెంట్ల లావాదేవీల్లో పాల్గొంటూ ప్రతిపక్ష పార్టీల నాయకుల, కార్యకర్తలపై అక్రమ కేసులు, బైండవర్ కేసులు బనాయిస్తూ చేర్యాల ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న సిఐపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి మండలానికి అనుచరుల్ని ఏర్పాటు చేసుకొని అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అన్యాయం జరిగిందని పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారిని బెదిరించి తన దారికి తెచ్చుకొని చేతివాటం ప్రదర్శించడం వినకుంటే చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మూడు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఎస్సైలతో బైండవరి కేసులు, అక్రమ కేసులు బనాయించి ఎఫ్ఐఆర్‌లు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని ఆరోపించారు. బాధితులకు రక్షణగా ఉండే చేర్యాల ప్రాంత రక్షక బట నిలయాలలో రక్షణ లేకుండా చేస్తున్నాడని నీతి పలుకులు పలుకుతూ తన ఉగ్రరూపాన్ని అమాయక ప్రజలపైన చూపిస్తున్నాడని చేర్యాల సర్కిల్లో ఇతని బాధితులు అనేకమంది ఉన్నారని తెలిపారు. పోలీస్ ఉన్నతధికారులు తనపై చర్యలు తీసుకోకపోతే ఈ ప్రాంత ప్రజలను ఏకం చేసి పోరాట, నిరసన కార్యక్రమాలకు నిర్వహిస్తామని తెలిపారు. ఆయనతో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, బుద్ధి పడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్ చేర్యాల మండల కార్యదర్శి బండ కింది అరుణ్ కుమార్, పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు పాల్గొన్నారు.

## ముదిరాజ్ జెండా ఆవిష్కరణ

**కొండపాక, నవంబరు 21, ప్రభాతవార్త :** ప్రపంచ మత్స్యకార్మికుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం దుద్దెడలో ముదిరాజ్ జెండాను ఎగురవేసినట్లు మత్స్యశాఖ డైరెక్టర్ చిలుముల నరహరి, మండల ముదిరాజ్ సంఘం కార్యదర్శి పాతర్ల కొండల్ తెలిపారు. కార్యక్రమంలో దుద్దెడ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మిద్దె శివకుమార్, ఉపాధ్యక్షుడు జగపతి నాగులు, ప్రధాన కార్యదర్శి గొడుగు కనకయ్య, ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

## విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాలి

**-ఎమ్మెల్సీ అంజిరెడ్డి**

**రామచంద్రాపురం, నవంబరు 21, ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీయాల్సిన అవసరం ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలో జిల్లా బాలల వైజ్ఞానిక ప్రదర్శనలో రామచంద్రాపురంలోని ఠాగూర్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందిన 6వ తరగతి విద్యార్థి గణేష్ ఎమర్జింగ్ టెక్నాలజీని ప్రదర్శించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల విద్యార్థిని, ఉపాధ్యాయులను ఎమ్మెల్సీ శాలువాలతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బట్టి చదువులను పక్కన పెట్టాలని ఇన్నోవేషన్‌తో విషయాలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ నాగ రమేష్, ఉపాధ్యాయులు శ్రావణ్, స్రవంతి పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్దే లక్ష్యం : కార్పొరేటర్ పుష్పనగేష్



శ్రీసాయి నగర్‌లో బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, నవంబరు 21, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల అభివృద్దే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్ కాలనీలో నూతన బోర్‌వేల్‌ను ప్రారంభించి కమ్యూనిటీహాల్, టాయిలెట్స్, ట్రాన్స్ షార్మర్‌లకు శంకుస్థాపనలు చేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను వివరిస్తూ కాలనీ అధ్యక్షులు కార్పొరేటర్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో ఏఈ దివ్య, గోవర్ధన్‌రెడ్డి, బ్రహ్మరాజు, భాస్కర్, నాగేశ్వర్‌రావు, శంకర్, నాగరాజు, చంద్రమౌళి, సురేష్, మాధవి, చంపావతి, అనిత, అనసూయ, విజయ, సుజాత, లత తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్ల పంపిణీ



చెకుముఖి పోటీల్లో మండల స్థాయి విజేతలను అభినందిస్తున్న దృశ్యం

**కంది, నవంబరు 21, ప్రభాతవార్త:** మండల స్థాయిలో నిర్వహించిన చెకుముఖి పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందచేశారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి పోటీలను మండల పరిధిలోని చేర్యాల పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పరీక్షలు రాశారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో చేర్యాల జిల్లా పరిషత్ విద్యార్థులు కె.ప్రణీత, ఎన్.వర్షిత, ఎల్.గౌతం, తెలుగు మీడియం విభాగంలో ఎద్దు మైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యారఉనతలు బి తనుశ్రీ, టి రిషిత, వి.సురేఖ, ప్రభుత్వ రెసిడెన్షియల్ విభాగంలో టిఎంఆర్ఐఈఎస్ కాశీపూర్ విద్యార్థులు ఎండి రెహాన్, పి.యశ్వంత్, ఎంఇ అర్షద్, ఆహ్మద్, ప్రైవేటు ఇంగ్లీష్ మీడియం విభాగంలో కేశవరెడ్డి హైస్కూల్ విద్యార్థులు ఎం.మధు, ఆర్.విశాల్, జె.రిషిక్‌రాజ్‌లు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చేర్యాల కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ వెంకటరాజయ్య ప్రకటిస్తూ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమొంటోలు అందచేసి అభినందించారు.

## సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



సైన్స్ ఫెయిర్‌లో మొదటి బహుమతిని అందుకున్న విద్యార్థులు

**జహీరాబాద్, నవంబరు 21, ప్రభాతవార్త:** జిల్లా సైన్స్ ఫెయిర్‌లో జహీరాబాద్ పట్టణంలోని ప్రతిభ మోడల్ హైస్కూల్ విద్యార్థులు 2 విభాగాల్లో జిల్లాస్థాయిలో మొదటి బహుమతులు అందుకున్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను ప్రిన్సిపాల్ చంద్రకళ అభినందించారు. నారాయణఖేడ్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లా సైన్స్‌ఫెయిర్ పోటీల్లో పాఠశాలకుచెందిన 9వ తరగతి విద్యార్థులు నీదాపర్వీన్, సోఫియా మహేక్ వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ విభాగంలో, గ్రీన్ ఎనర్జీ విభాగంలో మొదటి బహుమతిని అందుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ చంద్రకళ, కీర్తికుమార్, గైడ్ ఉపాధ్యాయులు ఇందిరా రాణితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

## కేతకి సంగమేశుడి ఆదాయం రూ.33,66,477

**ఝరాసంగం, నవంబరు 21, ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని శ్రీకేతకి సంగమేశ్వర స్వామి ఆలయ హుండీని శుక్రవారం లెక్కించగా భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా స్వామి వారికి 85 రోజులకు రూ. 33,66,477 సమర్పించుకున్నారు. శుక్రవారం ఆలయ ఆవరణలో హుండీని లెక్కించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు రంగారావు, ఆలయ కమిటి చైర్మన్ చంద్రశేఖర్, ఇఓ శివరుద్రప్ప, ధర్మకర్తలు మల్లయ్యస్వామి, శివకుమార్, నవాజ్ రెడ్డి, మల్లప్ప, బసయ్యస్వామి, ఎస్ఐ క్రాంతికుమార్ పాటిల్, నారాయణ, శ్రీ నరసింహసేవా సమితి బాధ్యులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పోలీసు సిబ్బంది,బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



కేతకి ఆలయంలో హుండిని లెక్కిస్తున్న దృశ్యం

# విద్యుత్ సమస్యలను పరిష్కరించండి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, నవంబరు 21 ప్రభాతవార్త**

పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ అధికారులతో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోఓల్టేజ్ కారణంగా విద్యుత్ సమస్యలు జరుగుతున్నాయన్నారు. అలాగే ఈసారి కురిసిన భారీ వర్షాలతో అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం జరిగిందని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, లోఓల్టేజ్ సమస్య ఉన్నచోట మరమ్మతులు చేసి విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం తరపున అన్నివిధాలుగా అండగా ఉంటామని, నియోజకవర్గనికి కావలసిన అన్ని విద్యుత్ పరికరాలు, ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, లైన్‌మెన్లు పాల్గొనారు.

**మెగా మెంటల్ వెల్‌నెస్ ఇంపాక్ట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే**

**నారాయణఖేడ్, నవంబరు 21 ప్రభాతవార్త**

పట్టణంలోని జీవన్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెంటల్ వెల్నెస్ ఇంపాక్ట్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గంప నాగేశ్వరరావు, మోటివేషన్ స్పీకర్స్, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి వెంకటరెడ్డి

## పోలీసు ఠాణాను పరిశీలించిన డిఎస్‌పి

**నాగల్‌గిద్ద, నవంబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని పోలీసు ఠాణాను శుక్రవారం డిఎస్‌పి వెంకటరెడ్డి పరిశీలించారు. ఠాణా పరిసరాలను పరిశీలించి రికార్డును తనిఖీ చేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ సిఐ శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఐ రామకృష్ణ,సిబ్బంది పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న విద్యార్థికి సన్మానం

**రూ. 2.50 లక్షల విలువచేసే బ్రాస్లెట్ అప్పగింత**



విద్యార్థి హర్షిత్‌ను సన్మానిస్తున్న బిఆర్ఎస్ నేత తిరుపతిరెడ్డి, తదితరులు

**రామాయంపేట, నవంబరు 21, ప్రభాతవార్త :** పట్టణంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆరోవ తరగతి చదువుతున్న హర్షిత్‌కు రెండున్నర లక్షల విలువైన బంగారు ఆభరణాలు(బ్రాస్లెట్) దొరింది. దీనిని నిజాయితీగా ఆ విద్యార్థి ప్రిన్సిపాల్‌కు అప్పగించాడు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ నేత, మెదక్ నియోజకవర్గ ఇంచార్జ్ కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హర్షిత్ ను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మట్టిరోడ్డు పనులకు ఎమ్మెల్యే శంఖుస్థాపన



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, నవంబరు 21 ప్రభాతవార్త :** పట్టణంలో రింగురోడ్డు పనులలో భాగంగా మట్టి రోడ్డు(మొరం) గ్రావెల్స్ రోడ్డు పనులను ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. మున్సిపల్ పట్టణం చుట్టూ లింకు రోడ్డులను కలిపే రింగు రోడ్డు పనులలో బాగంగా చాంద్‌ఖాన్‌పల్లి నుండి రాజన్న దాబా వరకు మట్టి రోడ్డు(మొరం) గ్రావెల్స్ రోడ్డు పనులను శంకుస్థాపన చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, పండరి రెడ్డి మాజీ ఎంపీటీసీ, తాహెర్ అలీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నగేష్, తదితర ముఖ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

## కళాశాలకు దుమ్మా కొట్టవద్దు.. ప్రతిరోజు రావాలి...

**రామాయంపేట, నవంబరు 21, ప్రభాతవార్త**

రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ప్రతిరోజు కళాశాలకు రావాలని కళాశాల అసిస్టెంట్ ప్రిన్సిపాల్ చరిత్ర ,అధ్యాపకులు గూడూరి మల్లేశం చెప్పారు. శుక్రవారం మండలంలోని దామరచెరువు గ్రామంలో విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు విద్యార్థులను కళాశాలకు పంపించాలని సూచించారు .అడ్మిషన్ పొంది కళాశాలకు రాకపోవడం వల్ల విద్యార్థుల జీవితం నాశనం అవుతుందన్నారు. ఇట్టి విషయంలో తల్లిదండ్రులు పలు చర్యలు తీసుకోవాలని సూచించారు .ప్రతిరోజు విద్యార్థి కళాశాలకు వస్తే పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని చెప్పారు. కళాశాలలో అడ్మిషన్ పొంది కళాశాలకు రాని విద్యార్థుల ఇండ్లలోకి వెళ్లి తల్లిదండ్రులకు విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ శంకర్

## టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం

**సదాశివపేట, నవంబరు 21 (ప్రభాతవార్త):** చెకుముఖి టాలెంట్ టెస్ట్ విజేతలకు ఎంఇవో శంకర్ బహుమతులు ప్రదానం చేశారు. సదాశివపేట మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగింది. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ టెస్ట్‌లో పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో జీనియస్ స్కూల్ ఆఫ్ ఎక్సెలెంట్ విద్యార్థులు రోహన్‌రెడ్డి, తహేరయాసుఫ్, ఖాజామొయినుద్దీన్ మండల ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి మండల విద్యాధికారి ఎన్.శంకర్ ప్రశంస పత్రం, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బాలయ్య, ప్రిన్సిపాల్ ప్రీతి, వైస్‌ప్రిన్సిపల్ శ్రీనివాస్, సాయికిరణ్ పాల్గొన్నారు.

## ప్రతిభచాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత



చెకుముఖి పోటీలో ప్రతిభ చాటిన వారికి సర్టిఫికెట్లు అందచేస్తున్న దృశ్యం

**అల్లాదుర్గం, నవంబరు 21, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి చెకుముఖి పోటీలు నిర్వహించి ప్రతిభ చాటిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. ఇంగ్లీష్ మీడియం విభాగంలో ముస్తాపూర్ పాఠశాల విద్యార్థులు, ద్వితీయ స్థానంలో అల్లాదుర్గం విద్యార్థులు, తెలుగు మీడియంలో అల్లాదుర్గం విద్యార్థి మొదటి స్థానంలో ద్వితీయ స్థానంలో బాలుర పాఠశాల విద్యార్థులు నిలిచారు. మండల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పరీక్షలు రాస్తారని మండల విద్యాధికారి లక్ష్మణ్ పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులు నందు, పూజశ్రీ, మహేష్, ఆదిత్య, శివప్రియ, దరియాసిలకు సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పిచ్చయ్య, జనార్ధన్, ప్రదీప్‌రెడ్డి, స్వప్న, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**విద్యుత్ ఆర్టిజన్స్ ఎంప్లాయిస్ జెఏసి చైర్మన్ రంజిత్**

**జోగిపేట, నవంబరు 21, ప్రభాతవార్త:**

తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ ఎంప్లాయిస్ జెఏసి సమావేశం నిర్వహించి జోగిపేట డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందులో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ ఉద్యోగులుగా కన్వర్షన్ చేయాలని తీర్మానం చేశారు. కాగా ఇందులో జోగిపేట జెఏసి కమిటి ఛైర్మెన్‌గా కె.రంజీత్, కన్వీనర్‌లుగా జె.రాజేందర్, సుధాకర్, కోఛైర్మెన్‌గా రాములునాయక్, కోకన్వీనర్‌గా నారాయణగౌడ్, వైస్‌ఛైర్మెన్లుగా ఎం.జోగినాథ్, నాగయ్య, రాజ్‌కుమార్, విజయ్‌కుమార్, జాయంట్ సెక్రెటరీలుగా సంగ్రామ్, జె.నర్సింగ్, మచ్చేందర్ గౌడ్, కె.అంబదాస్, కె.మహెందర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా బి.ప్రవీన్ కుమార్, మాణిక్యం, యేసు, కె.మహిపాల్‌రెడ్డి, కోశాధికారిగా కె.నర్సింలు, మీడయా ప్రతినిధిగా ఏ.నాగరాజులు ఎన్నికైనారు.



మాట్లాడుతున్న జెఏసి చైర్మన్ కె.రంజిత్

## ఆశా వర్కర్‌లకు యూనిఫాం చీరల పంపిణీ

**రామచంద్రాపురం, నవంబరు 21, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్‌లకు శుక్రవారం భారతీనగర్,రామచంద్రాపురం డివిజన్ కార్పొరేటర్లు వెన్నవరం సింధుఆదర్శ్‌రెడ్డి, బూరుగడ్డ పుష్పనగేష్ యూనిఫాం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు ఆశావర్కర్‌ల సేవలను కొనియాడారు. ఈసందర్భంగా ఆపుపత్రిలోని డ్రైనేజీ, పంబ్లింగ్ మరమ్మతు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను విన్న కార్పొరేటర్లు సమస్యల పరిష్కారానికి అధికారులకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ కల్పన, సిబ్బంది భాస్కర్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు రాణి యాదవ్, వెంకట్‌రెడ్డి, నరేష్, పిహెచ్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అందోల్ తాలుకా అధ్యక్షుడిగా శంకర్

**పుల్‌కల్, నవంబరు 21, ప్రభాతవార్త:** పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అందోల్ తాలుకాఅధ్యక్షుడిగా కె.శంకర్ ఎన్నికయ్యారు. అందోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి వట్‌పల్లి, అందోలు, పుల్‌కల్, చౌటకూరు మండలాలకు చెందిన పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు హాజరై సంఘాన్ని ఎన్నుకున్నారు. పుల్‌కల్ ఎంపిడిఓ కార్యాలయ పర్యవేక్షకులు(చౌటకూరు ఎంపిడిఓ)గా బాధ్యతలు నిర్వహిస్తున్న శంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పి.విఠల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కె.రాములు, మహిళా ఉపాధ్యక్షులుగా కె శైలజ, కోశాధికారిగా టి శ్రీధర్, సంయుక్త కార్యదర్శులుగా గులాం మహమ్మద్‌ఖాన్, బి శ్రీకాంత్ కన్నా, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి శివసాగర్, ఎన్‌వినయ్‌సాగర్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా పీవీ రామకృష్ణారెడ్డి, పి శ్రీనివాస్, జి రాధిక, జి మల్లికార్జున్, ఎం మాణిక్, ప్రభాకర్, పి రమేష్‌లను ఎన్నుకున్నారు.

## జాగ్రత్తలు పాటిద్దాం-అగ్ని ప్రమాదాలను నివారిద్దాం

**-విద్యార్థులకు జోగిపేట ఫైర్ అధికారి శ్రీనివాస్**



అగ్నిప్రమాద నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

**చౌటకూరు, నవంబరు 21, ప్రభాతవార్త:** అనుకోకుండా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకుంటే కొన్ని జాగ్రత్తలు పాటిస్తూ అగ్ని ప్రమాదంను అదుపులోకి తెచ్చుకోవచ్చని జోగిపేట అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలపరిధిలోని శివంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే ముందుగా మేయిన్ ఆఫ్ చేయాలన్నారు. అగ్ని ప్రమాదాన్ని అడ్డుకుంటే ఆస్తి, ప్రాణ నష్టాలను నివారించుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో చౌటకూరు, పుల్‌కల్ మండలాల మండల విద్యాధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేదశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కెటిఆర్‌పై తప్పుడు కేసు పెట్టడం దుర్మార్గం

**పాపన్నపేట, నవంబరు 21, ప్రభాతవార్త:**కెసిఆర్ కుటుంబాన్ని అప్రతిష్ట పాలు చేయడానికి కేటీఆర్ పై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు కేసు నమోదు చేసిందని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఫార్ములా ఈ రేసుతో పాటు అనేక కంపెనీలు తెచ్చి హైదరాబాదు యొక్క కీర్తి ప్రతిష్టలను పెంచి, ప్రపంచవ్యాప్తంగా పేరు తీసుకొచ్చిన కేటీఆర్ ను టార్గెట్ చేయడం తగదన్నారు. తప్పుడు కేసులు పెట్టి విచారణ పేరిట కేసీఆర్ కుటుంబాన్ని, బిఆర్ఎస్ పార్టీని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారని అన్నారు.కానీ కాంగ్రెస్ పార్టీ బీఆర్ ఎస్ ను ఏమి చేయలేదని ధీమా వ్యక్తం చేశారు

## సైన్స్ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి : ఎంఇవో

**పాపన్నపేట, నవంబరు 21, ప్రభాతవార్త :** సైన్స్ ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలని ఎంఇవో ప్రతాప్‌రెడ్డి అన్నారు, శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. కార్యక్రమానికి ఎంఈఓ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు, ఇందులో మండల పరిధిలోని వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఇవో బహుమతులు అందజేశారు, కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్, ఇన్చార్జి హెచ్ఎం వెంకటేశం, జన విజ్ఞాన వేదిక మెదక్ జిల్లా అధ్యక్షులు మోహన్ రావు, సైన్సు ఉపాధ్యాయులు స్రవంతి ప్రవీణ్ కుమార్, మండల బాధ్యులు నర్సింలు, అశోక్ కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, పీడీ రమేష్ ,విశ్వనాథ్ , శ్రావణ్, రాందాస్, ప్రభాకర్, దేవయ్య,నింగప్ప,రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల నుంచి దరఖాస్తు ఆహ్వానం

**జోగిపేట, నవంబరు 21, ప్రభాతవార్త:** అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో తాత్కాలిక ప్రాతిపదికన పారిశుద్య కార్మికులను నియమించనున్నామని, ఇందుకోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల 28లోగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఏ.రవీందర్ ఒక ప్రకనటలో కోరారు. పట్టణ మహిళా సమాఖ్య ద్వారా మొత్తం 9మందిని తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం దరఖాస్తు చేసుకోదలచినవారు తమ అడ్రస్ ప్రూఫ్, తాము చదుకుకు సంబంధించిన ధృవపత్రాలను మున్సిపాలిటీలోని మెప్మా విభాగంలో అందచేయాలని పేర్కొన్నారు. వీరిని 11 నెలల తాత్కాలిక కాలానికి తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.

## ఆరూర్ మాజీ సర్పంచ్ మృతి..ఎమ్మెల్యే నివాళి

**సదాశివపేట, నవంబరు 21 (ప్రభాతవార్త):** ఆరూరు గ్రామ మాజీ సర్పంచ్ పట్లోళ్ల బసవరాజు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలుసుకున్న సంగారెడ్డి శాసనసభ్యులు చింత ప్రభాకర్ గ్రామానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. స్నేహభావాన్ని పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకొన్నారు.వారి కుటుంబ సభ్యులను పలకరించి ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట సదాశివపేట మండల పట్టణ పార్టీ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, చిల మల్లన్న సీనియర్ నాయకులు ముద్దా నాగనాథ్, చిక్కుల మల్లన్న, మాజీ ఎంపీటీసీలు అల్లం లలిత, శివకుమార్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి రవిగౌడ్, మాజీ ఉప సర్పంచులు లక్ష్మణ్‌గౌడ్, మల్లికార్జున్, గ్రామ అధ్యక్షులు పాండురంగరాజు, నాయకులు అప్పుర్, మాధవ్‌గౌడ్, సంగమేశ్వర్, యాదగిరి తదితరులు వున్నారు.

## వీరాంజనేయ మందిర పునర్ నిర్మాణానికి విరాళాల వెల్లువ

**సదాశివపేట, నవంబరు 21 (ప్రభాతవార్త):** పట్టణంలోని 8వ వార్డ్ హనుమాన్‌నగర్‌లోని శ్రీవీరాంజనేయ స్వామి మందిరం పునః నిర్మాణంలో భాగంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరంజీవి 1,11,111రూపాయలు విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహాయం అందిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో సదాశివపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ,ఆత్మ కమిటీ డైరెక్టర్ రాములుగౌడ్, ఈశ్వర మార్కండేయ మందిర కమిటీ చైర్మన్ వెంకన్న,బాబు, లడ్డు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, బెజుగం దత్తు, శరత్‌చంద్ర, బిట్ల ప్రేమ్‌కుమార్, ముగిటి భరత్, అలయ కమిటీ సభ్యులు శివకోటి, పవన్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**జహీరాబాద్, నవంబరు 21 ప్రభాతవార్త :** 13 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డి శుక్రవారం పట్టణంలోని తన నివాసంలో పంపిణి చేశారు. సిఎంఆర్ఎఫ్ పథకం పేదల ఆరోగ్యానికి అండగా ఉంటుందని ఉజ్వల్‌రెడ్డి పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సింహారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, టిపిసిసి ఎస్సి సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ భీమయ్య, ఉపాధ్యక్షులు ముల్తాని, మాజీ వైస్ ఎంపిపి రాములు, సిడిసి డైరెక్టర్ మల్లారెడ్డి, బాణోత్ చందర్, నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, ధనసిరి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రంగా అరుణ్‌కుమార్, జహీర్ అరబ్బీ, ఖాసింపూర్ రాజు, జగన్మోహన్‌రెడ్డి, తూంకుంట రాజు, పట్లోళ్ల నాగిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, నథానెయల్ నరేష్, బబ్లూ, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం

**చిన్నకోడూరు, నవంబరు 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కళాశాల ప్రధాన గేటు వద్ద రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక బృధంతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు ఉన్నారు.

# ప్రభుత్వాలు మారినా మత్స్యకారుల జీవితాలు మారడం లేదు

**తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఎమండల అధ్యక్షుడు శ్రీనివాస్**

**హుస్నాబాద్ రూరల్, నవంబరు 21, ప్రభాతవార్త:** ప్రభుత్వాలు ఎన్నిమారినా మత్స్యకారుల జీవితాలు మారడం లేదని తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పెన్నబోయిన శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవంతో పాటు తెలంగాణ ముదిరాజ్ మహాసభ 11వ వార్షికోత్సవ వేడుకలను నాగారంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కార్పొరేషన్ కు రూ. 1000 కోట్లు కేటాయించాలని, ఎలాంటి షరతులు లేకుండా సభ్యత్వాలు అందించాలని డిమాండ్ చేశారు. చెరువు, కుంటలపై ముత్రాసి, తెనుగు, బెస్త, ముదిరాజ్,గంగపుత్ర, గూండ్ల కులాలకు మాత్రమే హక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు పెండ్యాల ఐలయ్య, అక్కనపేట అధ్యక్షుడు రాజయ్య, హుస్నాబాద్ అధ్యక్షుడు మల్లయ్య, రేగొండ అధ్యక్షులు ఎడల వనేష్, పోతారం ఎస్ అధ్యక్షులు రమేష్, పొట్లపల్లి ఉపాధ్యక్షులు మోటం రాజయ్య, గౌరవ అధ్యక్షులు మేడబోయిన చంద్రమౌళి, హుస్నాబాద్ కార్యదర్శి శ్రీనివాస్, నాగారం ఉపాధ్యక్షులు రాజయ్య, ముదిరాజ్ మహాసభ యువ నాయకులు భాష వేణి వెంకటేష్, వెంకటయ్య, రాజయ్య, రాములు, మల్లయ్య, పోచయ్య, సదానందం, మల్లవ్వ, రామవ్వలతో పాటు ఉన్నారు.



నాగారం గ్రామంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకల దృశ్యం

**హుస్నాబాద్ టౌన్‌లో...**

పట్టణంలోని చేపల మార్కెట్‌లో ప్రపంచ మత్స్యకారదినోత్సవాన్ని ముదిరాజ్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి జనవేని శ్రీనివాస్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. చేపల విక్రయదారులను సన్మానించి మిఠాయిలు తినిపించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధి కోసం 1954 నవంబర్ 21వ తేదీన కొంతమంది మేధావులు మగ, ఆడ చేపపిల్లలను ఒక తొట్టిలో వేయడం జరిగిందన్నారు. వాటి సంపర్కంతో అనేక చేప పిల్లలు పుట్టడంతో ఆరోజు నుంచి నవంబర్ 21వ తేదీన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు ఎడల రమేష్‌ముదిరాజ్ ఉపాధ్యక్షులు కేశవేని రమేష్ ముదిరాజ్. హుస్నాబాద్ టౌన్ అధ్యక్షులు రాగుల శ్రీనివాస్‌ముదిరాజ్,అక్కన్నపేట మండల అధ్యక్షుడు కాశబోయిన రవిముదిరాజ్, మత్స్య శాఖ అధ్యక్షులు పొన్నం మల్లయ్యముదిరాజ్, పినకాశి రమేష్‌ముదిరాజ్, చింతల బాలరాజుముదిరాజ్, మాచర్ల చందర్ ముదిరాజ్, ఐలయ్య ముదిరాజ్, మీర్జాపూర్ మత్స్య శాఖ అధ్యక్షులు సంపత్ ముదిరాజ్,ముదిరాజ్ ముఖ్య నాయకులు కులస్తులు పాల్గొన్నారు.